నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది
పెంచుకోవటమ్ము ,తుంచుకోవటమును
మాటతోనె గదర మహినజూడ
మంచిమాటవలన మనవారెయందరు
మరచిపోకుమయ్య మమతలెల్ల
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644
# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 185 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 15-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## మీ ఇష్టమొచ్చినప్పుడు దర్యాప్తు చేస్తారా?

- సమాఖ్య వ్యవస్థలో ఇదేం పద్ధతి
- ఇక రాష్ట్రాల్లో పోలీసులు దేనికి?
- ఇడి తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం


న్యూఢిల్లీ :
కేంద్రంలోని ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో పనిచేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై ఇప్పటికే ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం సైతం పదేపదే చీవాట్లు పెడుతున్న సంగతి విదితమే. కానీ పాలక పెద్దల ఒత్తిళ్లలో ఆ సంస్థ అధికారుల తీరు ఏమాత్రం మారడం లేదు. తమిళనాడు మద్యం కుంభకోణం ఆరోపణలపై దర్యాప్తునకు సంబంధించి విచారణ సందర్భంగా మంగళవారం నాడు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవారు నేతృత్వంలోని ధర్మాసనం ఇడిపై మరోమారు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే కేసులో తమిళనాడు రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇదే కేసులో దర్యాప్తు పేరుతో ఇడి తమిళనాడులో పదేపదే సోదాలు నిర్వహిస్తూ వస్తోంది.

-మిగతా 2 లో

## బీసీ రిజర్వేషన్లపై
4
# స్టే ఎత్తివేయండి

### సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ రాష్ట్ర ప్రభుత్వం

- హైకోర్టు ఉత్తర్వుల తొలగింపునకు అనుసరించాల్సిన వ్యూహాలపై న్యాయనిపుణులతో కసరత్తు చేసిన ప్రభుత్వం..



హైదరాబాద్,
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జారీచేసిన జీవో 9 అమలుపై హైకోర్టు విధించిన మధ్యంతర స్టేను ఎత్తివేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేసింది. హైకోర్టు ఉత్తర్వుల తొలగింపునకు అనుసరించాల్సిన వ్యూహాలపై న్యాయనిపుణులతో కసరత్తు చేసిన ప్రభుత్వం.. సోమవారం దాదాపు 50 పేజీలతో కూడిన పిటిషన్‌ను ఆన్‌లైన్‌లో దాఖలు చేసింది. గతంలో ఇంద్ర సాహ్నికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాజకీయ పదవుల్లో రిజర్వేషన్లు 50% మించకూడదని ఏపీ

-మిగతా 2 లో





## గ్రూప్-2 విజేతలకు 18న నియామక పత్రాలు

- సీఎం రేవంత్ చేతుల మీదగా శిల్పకళా వేదికలో అందచేత
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్,
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్-2 అభ్యర్థులకు ఈనెల 18 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామక పత్రాలు అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. 18 తేదీ సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సి.ఎస్. సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రూప్-2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి

-మిగతా 2 లో



## విశాఖలో గూగుల్ సెంటర్


- వికసిత భారత్ లక్ష్యాలకు తార్కాణం
- సుందర్ పిచాయ్‌కు మోడీ అభినందనలు

న్యూఢిల్లీ
విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ సెంటర్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందంపై మోదీతో ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పిచాయ్ చేసిన పోస్ట్‌కు ప్రధాని బదులిచ్చారు. గిగా సెంటర్ ఏర్పాటు వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఈ ఏఐ హబ్ బలమైన శక్తిగా పనిచేస్తుంది. దీనిద్వారా ప్రజలందరికీ కృత్రిమ మేధ అందుబాటులోకి రానుంది. మన డిజిటల్ ఎకానమికి మరింత ఊపునిస్తుంది. గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత స్థానం మరింత సుస్థిరమవుతుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు. దీనికి ముందు పిచాయ్ స్పందిస్తూ.. విశాఖపట్నంలో గూగుల్ తొలి ఏఐ హబ్‌కు సంబంధించిన ప్రణాళికలను పంచు

-మిగతా 2 లో

# మల్లోజుల సరెండర్

- ఆయనతో పాటు 60 మంది లొంగుబాటు
- వేణుగోపాల్‌రావుపై రూ.కోటి రివార్డు



మహదేవపూర్ అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )
మావోయిస్టు పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. సీపీఐ (మావోయిస్ట్) పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణు గోపాల్‌రావు అలియాస్ సోను దాదా అలియాస్ భూపతి 60 మంది మావో యిస్టు సహచరులతో మహారాష్ట్ర గడ్చి రోలి పోలీసుల ఎదుట మంగళవారం లొంగిపోయాడు. అంతేకాక ఆయన పోలీసులకు 50 ఆయుధాలను కూడా అప్పగించాడు. జగ్దల్‌పూర్, గడ్చిరోలి నుంచి వచ్చిన వార్తల ప్రకారం.. మావో యిస్టు సంస్థ అతిపెద్ద దెబ్బను చవిచూసిందని పలువురు విశ్లేషిస్తు న్నారు. సుమారు 30 సంవత్సరాల పాటు మావోయిస్టు పార్టీలో కొనసాగిన మల్లో జుల వేణుగోపాల్‌రావు 11 రోజుల కిందట.. మావోయిస్టు పార్టీ గతి తప్పిం దని, ఆత్మ సమర్పణ సరైన నిర్ణయమని, 22 పేజీల లేఖను విడుదల చేశారు. లొంగిపోయిన వివిధ కేడర్లలో గల మిలీషియా సభ్యులతోపాటు, కోర్ కమిటీ సభ్యులతో ఉన్న

-మిగతా 2 లో

## దేశంలో మొదటి ఎఐ సిటీగా
# మారనున్న విశాఖ

- విప్లవాత్మక మార్పులకు ఇదో శుభసూచిక
- విజినరీ లీడర్ చంద్రబాబు దూరదృష్టికి తార్కాణం
- ఎక్స్ వేదికగా డిప్యూటి సీఎం పవన్



అమరావతి,
దేశంలోని మొదటి ఎఐ సిటీగా విశాఖ మారబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. సిటీ ఆఫ్ డెస్టినీ నుంచి వికసిత్ భారత్ దిశగా చారిత్రాత్మక అడుగు పడిందన్నారు.. ఈ ప్రాజెక్ట్ అందరకీ ఉపయోగపడుతుంది. యువత, రైతులు, వైద్యులు, మత్స్యకారులు, వ్యాపారవేత్తలు, మహిళలు, విద్యార్థుల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం ఢిల్లీ వేదికగా ఏపీ ప్రభుత్వం.. గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదుర్చుకున్న విషయం విదితమే.. ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఏపీ మంత్రి నారా లోకేష్, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ సహా పలువురు గూగుల్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో

-మిగతా 2 లో



## దేవాదుల పూర్తికి ప్రభుత్వం
# కట్టుబడి ఉంది

- ఉత్తర తెలంగాణ సస్యశ్యామలమే సర్కారు సంకల్పం
- పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాల
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

. హైదరాబాద్ అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )
జే.చొక్కారావు-దేవాదుల ప్రాజెక్ పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. తద్వారా ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయడమే తమ ముందున్న కర్తవ్యమని వ్యాఖ్యానించారు. జే. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పురోగతిపై మంగళవారం డాక్టర్ బీ.ఆర్.అంబేదక్కర్ సచివాలయంలో నీటిపారుదల శాఖాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పంచాయత్ రాజ్ శాఖామంత్రి దపసరి అనసూయ సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు నాగరాజు, యశశ్వని రెడ్డి, సత్యనారాయణ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి,

-మిగతా 2 లో



## అగ్రరాజ్యం అమెరికాకు షాక్..

- హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ ర్యాంకింగ్స్‌లో 12వ స్థానానికి..!

న్యూఢిల్లీ -
అగ్రరాజ్యం అమెరికాకు షాక్ తగిలింది. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితా నుంచి పడిపోయింది. 20 సంవత్సరాల తర్వాత తొలిసారిగా యూఎస్ పాస్‌పోర్ట్ టాప్-10 నుంచి దిగజారింది. హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ ఆధారంగా విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో అమెరికా 12వ స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం, మలేషియాతో కలిసి యూఎస్ 12వ స్థానంలో నిలిచింది. అమెరికా పాస్‌పోర్ట్ హోల్డర్లు ఇప్పుడు కేవలం 180 దేశాలకు మాత్రమే వీసా లేకుండా ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. ఇక, ఈ జాబితాలో సింగపూర్ అగ్రస్థానంలో నిలిచింది. సింగపూర్ పాస్‌పోర్ట్‌తో 193 దేశాలకు వీసా లేకుండా వెళ్లవచ్చు. ఆ తర్వాత దక్షిణ కొరియా (190), జపాన్ (189) ఉన్నాయి. అమెరికా ర్యాంక్ పడిపోవడానికి చాలా కారణాలే ఉన్నాయి.

-మిగతా 2 లో

## హైకోర్టు జీవోను కొట్టేయడం

-మిగతా 3 లో

# బాధాకరం

### 42శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం

- కాంగ్రెస్ పార్టీ బిసిలకు అండగా జివో ఇచ్చింది
- సుప్రీంలో గట్టిగా వాదనలు వినిపంచేందుకు సిద్ధం
- అభిషేక్ మను సంఘ్వితో చర్చించామన్న పిసిసి చీఫ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )
తెలంగాణ ప్రభుత్వం ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చిందని.. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో చారిత్రాత్మకమని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజల జీవితాలు బాగుపరచాలని చిత్తశుద్ధితో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. అడుగడుగున బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తూ వచ్చినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఎక్కడ వెనక్కు తగ్గలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ముందుకు వెళ్లామని చెప్పారు. ఆర్డినెన్స్ తీసుకొచ్చి జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లేందుకు పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించామని.. కానీ రాష్ట్ర హైకోర్టు జీవో 9 పై స్టే విధించిందన్నారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం

-మిగతా 3 లో



## కాంగ్రెస్ పాలనలోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి

- ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- బీఆర్ఎస్‌కు గూబగుయ్యిమనేలా ఓటర్ల తీర్పు: పొన్నం

జూబ్లీహిల్స్
కాంగ్రెస్ పాలనలోనే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. ఉప ఎన్నిక సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగల్‌రావు నగర్, యూసుఫ్‌గూడ కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశం మంగళవారం యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయాన్ని

-మిగతా 2 లో

## బీసీ రిజర్వేషన్లపై స్టే ఎత్తివేయండి

(మొదటి తరువాయి)

లేదని, విద్య, ఉపాధి రంగాల్లో మాత్రమే రిజర్వేషన్లు 50% మించరాదని సుప్రీంకోర్టు చెప్పిందని వాదించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పన ఏకపక్షంగా చేయలేదని, వారి స్థితిగతులపై ఏకసభ్య కమిషన్ ద్వారా అధ్యయనం చేశాకే సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం చెప్తున్నది. రాష్ట్రంలో ఇంటింటి సర్వే నిర్వహించాక కులాలవారీగా పరిశీలన చేశామని, బీసీల జనాభా 57.6 శాతంగా ఉండటంతో ఆ సామాజిక వర్గాలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్ చేసిన సిఫార్సులను మంత్రివర్గం, శాసనసభ ఆమోదించాయని వివరించింది. రిజర్వేషన్లు 50% మించరాదన్న పరిమితిని ఎత్తివేస్తూ తెచ్చిన చట్టసవరణ, ఆర్డినెన్సు గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని చెప్పింది. బిల్లు, ఆర్డినెన్స్ నిర్దిష్ట వ్యవధిలోగా ఆమోదించడమో, తిరసరించడమో చేయకపోతే అవి ఆమోదం పొందినట్టు పరిగణించాలని తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు రిజర్వేషన్ల పెంపునకు జీవో 9 జారీచేశామని చెప్పింది. ఆ జీవో అమలును హైకోర్టు నిలిపవేయడాన్ని చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని ప్రభుత్వం ఎస్‌ఎల్పీలో కోరింది. ప్రస్తుతం ఈ ఎస్‌ఎల్పీ సుప్రీంకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నది. నంబర్ కేటాయింపు జరిగాక దానిపై ధర్మాసనం విచారణ చేపట్టనుంది. కాగా, ప్రభుత్వం ఎస్‌ఎల్పీ దాఖలు చేస్తే తమ వాదనలు విన్న తర్వాతే ఉత్తర్వులను జారీ చేయాలని హైకోర్టులో జీవో 9ని సవాల్ చేసిన పిటిషనర్లు ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేశారు.

## గ్రూప్-2 విజేతలకు 18న నియామక పత్రాలు

(మొదటి తరువాయి)

నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. వీరిలో దాదాపు 16 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారని. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నట్లు సి.ఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితో పాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం 4 గంటల లోపు శిల్పకళా వేదికలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, సాధారణ పరిపాలన, రెవిన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ, హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సి.ఎస్. ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్ లో ఉంటారు కాబట్టి, వీరికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, రిజ్వి, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.


## విశాఖలో గూగుల్ సెంటర్

(మొదటి తరువాయి)

కునేందుకు ప్రధానితో మాట్లాడానని, ఈ ఏఐ హబ్ ఓ కీలక మైలురాయిగా నిలవనుందని అన్నారు. ఇదొక చిరస్మరణీయమైన రోజు. విశాఖలో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణం కోసం గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం, ఏఐ విప్లవంలో భాగం కావడం గర్వంగా ఉంది. ఈ పెట్టుబడులు హెల్త్‌కేర్, వ్యవసాయం, లాజిస్టిక్స్, ఫైనాన్స్ వంటి రంగాల్లో వేగవంతమైన ఏఐ ఆధారిత పరిష్కారాల కోసం తగిన వ్యవస్థను సృష్టిస్తుంది. సంక్లిష్ట సవాళ్లను పరిష్కరించడంలో తగిన తోడ్పాటు లభిస్తుందని గౌతమ్ అదానీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. దిల్లీ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య మంగళవారం ఈ ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ రానున్న ఐదేళ్లలో సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. భారత్‌లో ఈ కంపెనీకి ఇదే అతిపెద్ద పెట్టుబడి కావడం విశేషం.

## మల్లోజుల సరెండర్

(మొదటి తరువాయి)



మావోయిస్టుల తలపై భారీగా రివార్డులు ఉండటంతోపాటు మల్లోజులపై రూ.కోటి రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. అయితే కొన్ని రోజుల కిందట ఆయన ప్రభుత్వానికి లొంగిపోవాలనే కోరికను వ్యక్తం చేయడం గమనించదగ్గ విషయం. ఇది మావోయిస్టు సంస్థలో అంతర్గత విభేదాలు, విభజనలకు దారితీసింది. ఇప్పటివరకు మావోయి స్టులు ఎక్కడ లొంగిపోయినా కేవలం వ్యక్తిగా లొంగిపోయేవారు కానీ ఆయుధాలను అప్పగించడం ఇదే తొలిసారని విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుతం లొంగిపోయిన మావోయిస్టు లందరినీ పోలీసులు విచారిస్తున్నారు. మల్లోజుల తన తండ్రి చనిపోయి నప్పుడు కూడా స్వగ్రామం పెద్దపల్లికి రాకుండా తల్లికి ఒక లేఖ రాసి ”నేను నా జీవితం మొత్తం మావోయిస్టు పార్టీకి అంకితం” అని పేర్కొన్నాడు. అలాంటి వ్యక్తి ఇటువంటి నిర్ణయం తీసుకోవడం మావోయిస్టు పార్టీలో కలకలంతోపాటు అలజడి నెలకొంది. ఆయన సోదరుడు మల్లోజుల కోటేశ్వర రావు (కిషన్‌జీ) విప్లవ స్ఫూర్తినే వేణు గోపాల్ ఆదర్శంగా తీసుకుని మావో యిస్టు పార్టీలో చేరి అత్యంత కీలకంగా వ్యవహరించారు. 2011 నవంబరు 24న బెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మల్లో జుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ మృతిచెందారు. తదనంతర పరి ణామాల నేపథ్యంలో మావోయిస్ట్ కమాండర్ అయిన మల్లోజుల వేణుగోపాల్ భార్య తారా కూడా లొంగిపోయారు.

## మీ ఇష్టమొచ్చినప్పుడు దర్యాప్తు చేస్తారా?

(మొదటి తరువాయి)



దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసినా..పట్టించుకోవడం లేదు. దీనిపైనే సుప్రీంకోర్టులో విచారణ సాగుతోంది. 'మీకు అనుమానం వచ్చినప్పుడల్లా మీకు మీరు స్వతహాగా దర్యాప్తు చేసేందుకు వెళ్లే అక్కడి పోలీసులకున్న దర్యాప్తు హక్కులు లాగేసుకోవడం కాదా? ఇక సమాఖ్య వ్యవస్థ సంగతేమిటి?' అని విచారణ సందర్భంగా సిజెఐ గవారు ఇడికి తలంటారు. ఈ విషయంలో దర్యాప్తు చేస్తున్న రాష్ట్ర పోలీసుల హక్కులను లాగేసుకోవడం లేదా? అని ప్రశ్నించింది. ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేయడం లేదా? శాంతి భద్రతలను ఎవరు నియంత్రిస్తారు. గత ఆరేళ్లలో ఇడికి సంబంధించి ఎన్నో కేసులు చూశాను. మళ్లీ నేనేం చెప్పదలచుకోలేదు' అని జస్టిస్ గవారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమిళనాడులో మద్యం రిటైలర్ 'టాస్మాక్'లో అవకతవకలకు సంబంధించి రాష్ట్ర పోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఇడి మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో మార్చిలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోదాలు జరిపింది. మే నెలలో సంబంధిత అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. చివరకు ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరుకుంది. విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఇడి అన్ని హద్దులు దాటుతోందని, సమాఖ్య పాలన భావనను ఉల్లంఘిస్తోందని ఆక్షేపించింది. టాస్మాక్‌పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తుపై స్టే విధించగా.. తాజాగా విచారణ పునఃప్రారంభించింది. ఈ నేపథ్యంలో సిజెఐ జస్టిస్ బీఆర్ గవారు, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం మరోసారి ఇడి తీరుపై అసంతప్తి వ్యక్తం చేసింది.

**స్టే పొడిగింపు**

తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ (టిఎఎస్‌ఎంఎసి)పై ఇడి చేపట్టిన మనీ లాండరింగ్ దర్యాప్తుపై విధించిన స్టేని సుప్రీంకోర్టు మంగళవారం పొడిగించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కు సంబంధించిన కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్లపై సుప్రీం ఉత్తర్వులు ఇచ్చేవరకు ఈ స్టే అమల్లో వుంటుందని ధర్మాసనం పేర్కొంది. కార్పొరేషన్ హెడ్‌క్వార్టర్స్‌పై ఇడి సోదాలు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చడాన్ని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం, టిఎఎస్‌ఎంఎసి సవాలు చేశాయి. కార్పొరేషన్ తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ 2014 నుండి 2021 వరకు అవినీతి ఆరోపణలపై రాష్ట్ర విజిలెన్స శాభ 47 ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసిందని, కానీ హఠాత్తుగా 2025లో ఇడి రంగ ప్రవేశం చేసిందని, వెంటనే కార్పొరేషన్ హెడ్‌క్వార్టర్స్‌పై దాడిచేసిందని, అధికారుల ఫోన్లు, వారి ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకుందని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇడి పాత్రను ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిపై దర్యాప్తుచేస్తుంది, ఇడి ఎవరు అవినీతిపై దర్యాప్తు చేయడానికి? అని సిబల్ ప్రశ్నించారు.

## అగ్రరాజ్యం అమెరికాకు షాక్..

(మొదటి తరువాయి)

ఈ ఏడాది బ్రెజిల్ తన వీసా రహిత ప్రవేశం రద్దు చేసింది. అలాగే, చైనా కూడా వీసా అవసరం లేని దేశాల జాబితాలో యూఎస్‌ను చేర్చలేదు. మయన్మార్, పపువా న్యూగినియా వంటి దేశాలు సైతం ఆంక్షలు విధించాయి. తాజాగా వియత్నాం, సోమాలియా కూడా అమెరికా పౌరులకు వీసా నిబంధనలను కఠినం చేశాయి. ఈ విషయంలో యూకే కూడా ఏ మాత్రం భిన్నంగా లేదు. గతంలో టాప్‌లో ఉన్న బ్రిటన్, ఇప్పుడు ఎనిమిదో స్థానానికి పడిపోయింది. ఇంకా, హెన్లీ ఓపెన్‌నెస్ ఇండెక్స్ ప్రకారం, ఇతర దేశాల పౌరులను ఆహ్వానించడంలో అమెరికా వెనుకబడి పోయింది. ఇప్పటి వరకు, అమెరికా పౌరులకు 180 దేశాలు వీసా లేకుండా ప్రయాణ సౌకర్యం ఉండగా.. అమెరికా మాత్రం కేవలం 46 దేశాల పౌరులను మాత్రమే వీసా లేకుండా అనుమతిస్తోంది. అందువల్ల ఈ జాబితాలో అమెరికా 77వ స్థానంలో నిలిచింది. చైనా ఈ విషయంలో ముందుకు దూసుకెళ్లే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. గత 10 సంవత్సరాల్లో చైనా తన పాస్‌పోర్ట్ ర్యాంకును 94 నుంచి 64కు మెరుగుపరచుకుంది. చైనా ఇప్పుడు 76 దేశాల పౌరులకు వీసా రహిత ప్రవేశం కల్పిస్తూ, ఓపెన్‌నెస్ ఇండెక్స్‌లో 65వ స్థానంలో నిలిచి.. అమెరికాను అధిగమించింది

### హైకోర్టు జీవోను కొట్టేయడం
## బాధాకరం

(మొదటి తరువాయి)

బాధాకరమని పీసీసీ చీఫ్ అన్నారు. పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించినప్పటికీ స్టే విధించారని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం తరపున ఎస్‌ఎల్పీ దాఖలు చేశామని.. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో దాదాపు గంట పాటు చర్చించినట్లు చెప్పారు. అన్ని విషయాలను కూలంకుషంగా చర్చించామన్నారు. గురువారానికి కేసు విచారణకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. హైకోర్టు పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని చెప్పిన నేపథ్యంలో బాధతో సుప్రీంకోర్టుకు వచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని.. న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకునే విధంగా అసెంబ్లీలో బిల్లు పెడితే అన్ని పార్టీలు మద్దతు తెలిపాయని.. కానీ ఇప్పుడు మాట మార్చి బీజేపీ, బీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. 42? రిజర్వేషన్లు ఎక్కడా తగ్గకుండా ముందుకు వెళు న్నామని.. సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. తమది న్యాయబద్ధమైన కోరిక అని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో మహేష్ గౌడ్ మంగళవారం భేటీ అయ్యారు. 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం తరపున గట్టి వాదనలు వినిపించాలని సీనియర్ న్యాయవాదిని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.

## కాంగ్రెస్ పాలనలోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి

(మొదటి తరువాయి)

అందించడం పార్టీ కార్యకర్తల బాధ్యత అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రతి ఓటర్‌కూ చేరవేయాలన్నారు. కలిసికట్టుగా కష్టపడితే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ గూబ గుయ్యిమనేట్టు ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారని తెలిపారు. ఈ ఉప ఎన్నికలో ఆ పార్టీ చిరునామా గల్లంత వుతుంద న్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో జూబ్లీహిల్స్‌లో ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతో కన్నీరు పెట్టిస్తూ గులాబీ పార్టీ ఓట్ల కోసం ఆరాటపడుతున్నదని విమ ర్శించారు. సునీతపై తమకు సానుభూతి ఉంది కానీ కేటీఆర్, హరీశ్ వారి రాజకీయాల కోసం ఆమెను ఇబ్బంది పెడుతున్నారని విమర్శిం చారు. దొంగ ఓట్లు కాంగ్రెస్‌కు అవసరం లేదని, బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగ ఓట్ల నమోదుకు బీఆర్‌ఎస్, బీజేపీదే బాధ్యత అన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్ర మంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, సీతక్క, ఎంపీ, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు అనిల్‌కుమార్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్‌లు విజయారెడ్డి, సీఎన్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ చైర్మెన్ శివసేన, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, సీనియర్ నాయకులు అజారుద్దీన్, మురళిగౌడ్, సంజరు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### దేశంలో మొదటి ఎఐ సిటీగా
## మారనున్న విశాఖ

(మొదటి తరువాయి)

పాల్గొన్నారు.. ఇక, విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌పై ఎక్స్‌లో పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు .. గూగుల్ 15 బిలియన్ డాలర్లతో ఎఐ డేటా సెంటర్‌తో విశాఖకు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందుతుందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వం ప్రధాన ప్రేరణగా పేర్కొన్నారు పవన్ కల్యాణ్.. విశాఖలో ఎఐ డేటా సెంటర్ సాధన సీఎం చంద్రబాబు నాలుగు దశాబ్దాల విజనరీ లీడర్‌షిప్‌కు నిదర్శనంగా అభివర్ణించిన ఆయన.. ఎఐ టెక్నాలజీతో ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలన్న లక్ష్యం.. ప్రభుత్వం మాత్రమే కాదు, ఈ కొత్త ప్రగతి యుగానికి అందరం అవసరం అన్నారు. యువత కొత్త ఆవిష్కరణలు చేయాలి, విద్యావేత్తలు పరిశోధనలో ముందుండాలి.. పౌరులు చురుకుగా పాలుపంచుకోవాలి, పరిశ్రమలు విస్తరణకు ముందుకు రావాలి. భవిష్యత్ భారత నిర్మాణంలో విశాఖ కీలక కేంద్రంగా అవతరించనుంది.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్ చారిత్రాత్మక భాగస్వామ్యం అవుతుంది.. 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఆంధప్రదేశ్, దేశం డిజిటల్ రంగంలో కొత్త దిశగా అడుగుపెట్టనుంది అన్నారు పవన్ కల్యాణ్.. వేలాది ఉద్యోగావకాశాలు సృష్టించబోతున్న డేటా సెంటర్ ప్రాజెక్ట్ ఇది.. యువతకు ఆధునిక టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్స్‌లో కొత్త అవకాశాలు వస్తాయి.. డిజిటల్ యుగంలో భారత స్థాయిని గ్లోబల్ లీడర్‌గా బలోపేతం చేసే ప్రాజెక్ట్ ఇది.. దీనిని సహకారం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, మంత్రి నారా లోకేష్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## దేవాదుల పూర్తికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

(మొదటి తరువాయి)

నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సలహాదారుడు ఆదిత్య నాథ్ దాస్, సహాయ కార్యదర్శి కే.శ్రీనివాస్, ఈఎన్సీలు అంజద్ హుస్సేన్, రమేష్‌బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నిర్ణీత కాలవ్యవధిలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. పాలనాపరమైన అడ్డంకులను సత్వరం తొలగించి పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా గంగారాం గ్రామ సమీపంలోని గోదావరి నది నుండి 38.16 టీఎంసీల నీటిని వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భుపాలపల్లి, ములుగు, జనగామ, యాదాద్రి భువనగిరి. సూర్యాపేట, సిద్ధిపేట జిల్లాలలో 5.57 లక్షల ఏకరాలకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టు రూపొందించబడిందని ఆయన వివరించారు. 71 మీటర్ల ఎత్తు నుంచి 540 మీటర్ల ఎత్తు వరకు, మొత్తం 469 మీటర్ల మేర ఎత్తిపోతల పథకమన్నారు. పంప్ హౌస్ లు, కాలువల తవ్వకాలు, నీటి సరఫరా తదితర పనులు పూర్తి చేసేందుకు గాను మూడు దశల్లో పనులు జరుగుతున్నాయన్నారు. 5.56 లక్షల ఎకరాలను సాగులోకి తేవడానికి ఉద్దేశించబడిన ఈ ప్రాజెక్టు కింద ఇప్పటి వరకు 3.17 లక్షల ఏకరాలకు సాగు నీరు అందిస్తున్నామన్నారు. భూగర్భజలాలతో సాగులో ఉన్న 58,028 ఎకరాల విస్తీర్ణంతో కలుపుకుంటే మొత్తం ఆయకట్టు 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సవరించిన అంచనాల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.18,500 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.14,269,63 కోట్లు ఖర్చు పెట్టినట్టు ఆయన వెల్లడించారు. మిగిలిన పనుల పూర్తికి రూ.4,230 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. ఖర్చు చేసిన మొత్తంలో నిర్మాణానికి గాను రూ. 11,667.85 కోట్లు ఖర్చు చేయగా భూసేకరణ నిమిత్తం 1,343.06 కోట్లు ఖర్చు పెట్టమన్నారు. అంతే గాకుండా హైడ్రో-మెకానికల్-విద్యుత్ అవసరాల నిమిత్తం రూ. 1,170.63 కోట్లు ఖర్చు పెట్టమన్నారు. 2,430 కిలోమీటర్ల కాలువ తవ్వల్సి ఉండగా 1,663.10 కిలోమీటర్ల తవ్వకాలు పూర్తి అయ్యాయని చెపాపరు. అలాగే 702.62 కిలోమీటర్ల పైపులైన్‌కు గాను ఇప్పటికి 669.66 కిలోమీటర్ల మేర పూర్తి చేశారని వివరించారు.

## 2025 అక్టోబర్ 15, బుధవారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
ఆశ్వయుజ మాసం
కృష్ణ పక్షం
తిథి
అష్టమి: అక్టోబర్ 14 ఉదయం
10:59 అక్టోబర్ 15 ఉదయం 11:08 వరకు
నవమి: అక్టోబర్ 15 ఉదయం 11:08
అక్టోబర్ 16 ఉదయం 11:37 వరకు
నక్షత్రం
పునర్వసు: అక్టోబర్ 14 ఉదయం 9:15
అక్టోబర్ 15 ఉదయం 11:08 వరకు
పుష్యమి: అక్టోబర్ 15 ఉదయం 11:08
అక్టోబర్ 16 మధ్యాహ్నం 1:13 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:38 - 5:23
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:40 - 12:25
అమృతకాలం: మధ్యాహ్నం 1:44 - 3:16
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 12:03 -1:31
యమగండం: ఉదయం 7:39 - 9:07
గుళికా: ఉదయం 10:35 - 12:03
దుర్ముహూర్తం: ఉదయం 11:18 - 12:06, రాత్రి 10:27 - 11:15
వర్జ్యం: రాత్రి 12:32 - 2:12

# సప్తగిరి కాలనీ సమస్యల పరిష్కారానికి కేఎల్ఆర్ హామీ



**తుక్కుగూడ, అక్టోబర్ 14 (నిలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండల కేంద్రంలో బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో మాజీ కార్పొరేటర్లు ఇంకా పెత్తనం కొనసాగిస్తుండటంపై కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రోజు తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో శ్రీ సప్తగిరి కాలనీ వాసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్, గుడికి దారి వంటి మౌలిక సదుపాయాలపై విస్తృతంగా చర్చ జరిగింది. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని కేఎల్ఆర్ కోరారు. "ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లండి. అవసరమైతే పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేయండి," అని కాలనీవాసులకు సూచించారు. మాజీ కార్పొరేటర్ల పెత్తనం, వసూళ్లపై తీవ్రంగా స్పందించిన లక్ష్మారెడ్డి, ప్రజల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. త్వరలోనే స్వయంగా సప్తగిరి కాలనీని సందర్శించి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో శ్రీ సప్తగిరి కాలనీ వాసులు, బడంగ్‌పేట కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 42% బీసీ రిజర్వేషన్ల అమలుకు పోరాడాలి: రమేష్

**వనపర్తి, అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**




రాష్ట్రంలో 42% బీసీ రిజర్వేషన్లు మనకు బీసీ సంఘాలు మద్దతుదారులు పోరాడాలని సిపిఐ పట్టణ కార్యదర్శి జే రమేష్ కోరారు. వనపర్తి సిపిఐ ఆఫీసులో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాభాను లెక్కించి దాని ప్రకారమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ జీవో తెచ్చారని దాన్ని కొట్టివేయటం బాధాకరమన్నారు. సిపిఐ బీసీలకు 42% రిజర్వేషన్కు మద్దతు ఇస్తూ కోర్టు కేసులో ఇంప్లీడ్ అయిందని బిజెపి, టిఆర్ఎస్ ఎందుకు ఇంప్లీడ్ కాలేదని ప్రశ్నించారు. బిజెపి అసెంబ్లీ చేసిన 42% రిజర్వేషన్ బిల్లును ఆమోదించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. టిఆర్ఎస్ కూడా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. బిజెపి బీఆర్ఎస్ పెదవులపై బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలుపుతూ లోపల అమలు కాకుండా కుట్రలు చేస్తున్నాయన్నారు. రేపు బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్రవ్యాప్తంగా 42 శాతం రిజర్వేషన్లకు మద్దతుగా కోర్ట్ స్టేట్ వ్యతిరేకంగా జిల్లా మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపడుతుందన్నారు. వనపర్తి లో జరిగే ఆందోళనకు సిపిఐ మద్దతు ఇచ్చి పాల్గొంటుందన్నారు. పార్టీలకతీతంగా జిల్లాలో బీసీ సంఘాలు మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పట్టణ నేతలు చిన్న కుర్మయ్య జయమ్మ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# 26న డాక్టర్ గోరటి వెంకన్నకు ఘన సన్మానం

### ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎంపీ మల్లు రవి



**తెలకపల్లి, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలకపల్లి మండల పరిధిలోని గౌరారం గ్రామంలో ఈనెల 26న ప్రముఖ కవి, వాగ్గేయకారుడు డాక్టర్ గోరటి వెంకన్నకు ఘన సన్మాన సభ నిర్వహించనున్నట్లు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. మంగళవారం గౌరారం గ్రామంలో డాక్టర్ గోరటి వెంకన్న నివాసాన్ని సందర్శించిన ఎంపీ మల్లు రవి, సభ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఇటీవల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసి గోరటి వెంకన్నను సన్మానించిన విషయం తెలిసిందే. జిల్లాలోని కవులు, కళాకారులు, మేధావులు, విద్యావంతుల ఆధ్వర్యంలో, ఎంపీ మల్లు రవి సమక్షంలో ఈ సన్మాన సభను గౌరారం గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. "ఈ ప్రాంత గర్వంగా భావించే డాక్టర్ గోరటి వెంకన్నను సన్మానించడం ఆనందకరం. సభను విజయవంతం చేయడానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలి," అని పిలుపునిచ్చారు. శనివారం గ్రామస్థులతో సమావేశమై సభ నిర్వహణపై చర్చించారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎంపీ, చెరువు కింద కాలువల మరమ్మతులు చేపడతామని, రెండో విడతలో గౌరారం గ్రామానికి ఎక్కువ ఇండ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, వల్లపరెడ్డి, బండ పర్వతాలు, బోయ మల్లయ్య, కురుమూర్తి సాంబశివుడు, వెంకటయ్య, రఘుకుమార్, కురుమూర్తి శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ఉచిత విత్తనాల పంపిణీ



**పానగల్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పానగల్ మండల కేంద్రంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పల్లి విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కేంద్ర నూనె గింజల అభివృద్ధి పథకం కింద పాన్‌గల్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ద్వారా వ్యవసాయ రైతు వేదికలో 100 శాతం సబ్సిడీతో విత్తనాలను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమాన్ని రత్నగిరి ఫౌండేషన్ డైరెక్టర్ శివశంకర్ పర్యవేక్షించగా, వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ ముఖ్య అతిథిగా హాజరై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రైతుల ఆర్థిక స్వావలంబన పెంపొందించడమే తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక మరియు సంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారి ప్రధాన లక్ష్యం. అదే దిశగా నూనె గింజల సాగును ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టాం," అని తెలిపారు. మండలంలో 1200 మంది రైతులకు ఎకరాకు 80 కిలోల విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ, సూచనలతో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఏడీ తిప్ప స్వామి, ఏవో రాకేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు కేతేపల్లి రవి, వెంకటేష్ నాయుడు, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, చైల్డ్ కేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ కుమార్, నాయకులు బ్రహ్మం, జయరాములు, పుల్లారావు, భాస్కర్ యాదవ్, రాము యాదవ్, వాల్మీకి, విష్ణు, వహీద్, వెంకటయ్య, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# డిజిపి శివధర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఫుడ్ కమిషన్ చైర్మన్

**హైదరాబాద్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం నాడు హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయాన్ని సందర్శించారు. ఇటీవల రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన బి. శివధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిజిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ పాత్రపై చర్చ జరిగినట్లు సమాచారం.

# ఓట్ల చోరీపై కాంగ్రెస్ సంతకాల సేకరణ



**కడ్తాల్, అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో 100 మందితో సంతకాల సేకరణ చేపట్టాలని ఏఐసీసీ ఆదేశించింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి గారి ఆదేశాలతో మంగళవారం కడ్తాల్ మండలం మక్త మధారం గ్రామంలో కల్వకుర్తి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎండి. షాబుద్దీన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా షాబుద్దీన్ మాట్లాడుతూ దేశంలో బిజెపి పార్టీ పెద్ద ఎత్తున ఓటు చోరీ చేసి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆర్కోటం సురేష్, యట సురేష్, యట రమేష్, క్రాంతి, కరీం, సమీర్, అశ్విని, మంజుల, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ

### మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహాతో కలిసి పంపిణీ చేసిన మంత్రి తుమ్మల




**కడ్తాల్, అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేపట్టింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదగా 100శాతం సబ్సిడీని రైతులకు అందించారు. అలాగే పామ్ ఆయిల్, మొక్కజొన్నలు, సన్ ఫ్లవర్, రైతుకు అధిక దిగుబడి వచ్చే పంటలను పండించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ యాట గీత నరసింహ ముదిరాజ్, సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, హరి మోహన్ రెడ్డి, నింగారి కృష్ణయ్య, దుర్గని జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



**కడ్తాల్, అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామానికి చెందిన నాయిని బుచ్చయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ప్రభుత్వ సాయం కోసం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని అభ్యర్థించారు. ఈ మేరకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 44వేల చెక్కును మంగళవారం కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి చేతుల మీదగా మంగళవారం లబ్ధిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లా సురేందర్ రెడ్డి, చల్లంపల్లి మాజీ సర్పంచ్ నాయిని నరేందర్, అడ్వకేట్ గణేష్, నాయిని శ్రీరాములు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో సర్వేయర్ వేణు

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ వేణు రూ. 20,000 లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ దాడిని ఏసీబీ డీఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. లంచంగా తీసుకున్న నోట్లపై వేణు వేలిముద్రలు స్పష్టంగా కనిపించడంతో, అతనిని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. ఈ ఘటనపై మరింత విచారణ కొనసాగుతోంది.

# ఓ అధికారి నేను రహదారిని నన్ను కాపాడండి.

-నాకోసం ప్రజలు టాక్స్‌లు కడుతున్నారు.
-గుంతలతో ప్రమాదకరంగా మారిన కోళ్లపడకల్
-శంషాబాద్ ప్రధాన రహదారి





**మహేశ్వరం,అక్టోబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల పరిధిలోని కోళ్లపడకల్ నుండి శంషాబాద్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో గాంధీనగర్ తండా వద్ద గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా రహదారి గుంతలతో నిండిపోయింది.దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా రాత్రి సమయంలో గుంతలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల పలువురు బైక్ సవారీలకు ప్రమాదాలు సంభవించాయి.ఈ విషయంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నాకోసం ప్రజలు టాక్స్‌లు కడుతున్నారు, ఓ అధికారి నేను రహదారిని, నన్ను కాపాడండి సార్! రోజు ప్రయాణించే ప్రయాణికులు అన్ని విధాల అధికారులను వేడుకుంటున్నారు.స్పందించని మహేశ్వరం,అధికారులు మరియు ప్రభుత్వం,తక్షణమే చర్యలు తీసుకుని రహదారి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పారమిత పాఠశాలలో ఘనంగా స్కౌట్స్ గైడ్స్ ఇన్వెస్టిచర్ వేడుక



**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంకమ్మ తోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ ఇన్వెస్టిచర్ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ ప్రారంభించారు. నూతన సభ్యులకు స్కార్ఫ్‌లు, బ్యాడ్జ్‌లు అందజేశారు. సేవా భావనతో విద్యార్థులు నాలుగు సంవత్సరాల శిక్షణ తీసుకుని గవర్నర్, రాష్ట్రపతి అవార్డులు పొందాలని ఆయన సూచించారు. చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన్, అనుకర్ రావు, వినోద్ రావు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, కవిత, గైడ్ కెప్టెన్ రజిత, స్కౌట్స్ మాస్టర్ జిలాని తదితరులు పాల్గొన్నారు.


# "ఆరోగ్య మహిళ" పరీక్షలు వినియోగించుకోవాలి

కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో "ఆరోగ్య మహిళ" కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. నగరంలోని సప్తగిరి కాలనీ అర్బన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆమె, పరీక్షలు చేయించుకుంటున్న మహిళలతో మాట్లాడారు. రక్తపోటు, షుగర్ వంటి వ్యాధుల వివరాలను నమోదు చేసి, ప్రతి నెలా మందులు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రయివేటు స్టోర్లలో లభించే అన్ని మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని ప్రజలకు తెలియజేయాలన్నారు. గర్భిణీలకు సాధారణ ప్రసవాలకు ప్రోత్సాహం ఇవ్వాలని, హెమోగ్లోబిన్ పరీక్షలు చేసి, ఐరన్ మాత్రలు, పోషకాహారం అందించాలని సూచించారు. అనంతరం ప్రతిమ ఫౌండేషన్ మొబైల్ వాహనంలో 2డి ఎకో, ఎక్స్‌రే, మమ్మోగ్రఫీ పరీక్షల తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సనా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లలను పత్తి చేలకు తీసుకెళ్తే కేసులు నమోదు చేస్తాం: ఎస్సై నరేష్





**తెలకపల్లి, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలకపల్లి మండల పరిధిలోని గౌరారం గ్రామ సమీపంలో బడి ఈడు కలిగిన పిల్లలు పాఠశాలలో ఉండాలి తప్ప పత్తి చేలలో ఉండరాదని స్థానిక ఎస్సై నరేష్ హెచ్చరించారు. మంగళవారం గౌరెడ్డిపల్లి గ్రామ సమీపంలో వాహనాలలో పిల్లలను తరలిస్తుండగా జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ, తెలకపల్లి పోలీస్ శాఖ, విద్యాశాఖ, చైల్డ్ హెల్ప్ లైన్, కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాహనాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ, "18 సంవత్సరాల లోపు పిల్లలు పాఠశాలలో ఉండాలి. వారిని పత్తి చేలకు తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. నేటి బాలలే రేపటి పౌరులు. వారు ఉన్నత విద్య పొందాలి, మంచి ఉద్యోగాలు సంపాదించాలి. వారి భవిష్యత్తును పాడు చేయకూడదు," అని స్పష్టం చేశారు. తదుపరి కొల్లాపూర్ మండలం మొల్ల చింతలపల్లి, నార్లాపూర్, ముక్కిడి గుండం, పెద్ద కొత్తపల్లి మండలం సాతాపూర్, లింగాల మండలం అంబటిపల్లి గ్రామాల నుంచి బడి మధ్యలో మానివేసిన విద్యార్థులను ప్రైవేటు బుల్లోరా వాహనాలలో తరలిస్తుండగా, గౌరెడ్డిపల్లి సమీపంలో 22 మంది పిల్లలను గుర్తించి, వాహనదారులకు, విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలకు పంపించారు. వాహనదారులు పిల్లలను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరేష్, మండల విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, డీసీపీయూ యూనిట్ డీసీపీఓ శ్రీశైలం, మధుబాబు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేస్ వర్కర్ ప్రమీల, కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్లు శ్రీనివాస్ యాదవ్, జాకీర్ హుస్సేన్, కల్పన, తెలకపల్లి పోలీస్ కానిస్టేబుళ్లు వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రైతు సదస్సు -వ్యవసాయ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేట రూరల్ మండలంలోని తోర్నాల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం సంయుక్త ఆధ్వర్యంలో రైతు సదస్సు మరియు వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా హాజరై వ్యవసాయ ప్రదర్శన స్టాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ఆహారం అందరికీ అవసరం. 150 కోట్ల జనాభా ఉన్న దేశం అయినప్పటికీ, కరోనా సమయంలో కూడా ఆహార కొరత లేకుండా నిలబడగలిగిన ఘనత రైతులదే. నేను 20 సంవత్సరాల పాటు స్వయంగా వ్యవసాయం చేశాను. పంటల సాగు ప్రక్రియపై పూర్తి అవగాహన ఉంది," అని తెలిపారు. ఆమె మాట్లాడుతూ, "సంప్రదాయ పద్ధతుల నుంచి మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త వంగడాలు, పద్ధతులు అలవర్చుకోవాలి. వరి, పత్తి వంటి పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, విద్యార్థులు సూచిస్తున్న ఆర్గానిక్ పద్ధతులను రైతులు స్వీకరించాలి. యూరియా అధికంగా వాడటం వల్ల నేల, నీరు, గాలి కలుషితం అవుతున్నాయి. దీని ప్రభావంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. మేలైన వ్యవసాయ పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే మన బాధ్యత," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డా. సంతోష్ కుమార్, ఏడిఏ పద్మ, ఏజీ కాలేజీ సిరిసిల్ల అసోసియేట్ డీన్ సునీత దేవి, రైతులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.
తోర్నాల వ్యవసాయ విద్యాలయ విద్యార్థులు, బీజేఆర్ వ్యవసాయ కళాశాల (జిల్లెల్లగడ్డ, సిరిసిల్ల) విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమ ముగింపు సందర్భంగా ఈ సదస్సు నిర్వహించారు.

# మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకం

డీఈఓ మొండయ్య





**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మానవ అక్రమ రవాణా నిర్మూలనలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములై ముందుకు రావాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) మొండయ్య, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ట్రైనింగ్ కోఆర్డినేటర్ అంబర్ సింగ్ పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి మరియు ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్ వాణినికేతన్ కిడ్స్ కేర్ హాల్‌లో రెండు రోజుల శిక్షణా శిబిరం ప్రారంభమైంది. మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మొండయ్య మాట్లాడుతూ'మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న అత్యంత ప్రమాదకరమైన నేరం. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన బాలికలు, మహిళలు ఎక్కువగా దీని బారిన పడుతున్నారు. సమాజంలో ప్రజలతో, విద్యార్థులతో సన్నిహితంగా ఉండే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలి. పాఠశాలల పేరెంట్స్ మీటింగ్‌లలో ఈ అంశంపై అవగాహన కల్పించాలి. సైబర్ ట్రాఫికింగ్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, పిల్లలకు మొబైల్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలను వివరించాలి," అని సూచించారు.

**అంబర్ సింగ్ మాట్లాడుతూ**
"మానవ అక్రమ రవాణాను ప్రారంభ దశలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించుకోవచ్చు. ప్రతి రోజు అనేక మంది బాలికలు, మహిళలు ఆకర్షణకు గురై పట్టణాలకు వెళ్లి వ్యభిచార గృహాల్లో చిక్కుకుంటున్నారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటివరకు 32 వేల మందికి పైగా బాలికలు, మహిళలను రక్షించగలిగాం. ఇందులో చిన్నారులు, యువతులు అధికంగా ఉన్నారు. సైబర్ ట్రాఫికింగ్ ద్వారా అక్రమ రవాణా మరింత పెరిగింది. విద్యార్థులు అనవసరంగా మొబైల్ అప్లికేషన్ల ద్వారా వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు పంపడం వల్ల సెక్స్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఉన్న సిబ్బంది ఈ అంశంపై అవగాహన పెంచుకుని ఇతరులకు తెలియజేయాలి," అని పిలుపునిచ్చారు. ఈ శిక్షణలో మానవ అక్రమ రవాణా ఎలా జరుగుతుంది, బాధితులపై ప్రభావాలు, సైబర్ ఆధారిత వ్యభిచార ముఠాల తంతు, చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా భారతీయ న్యాయ వ్యవస్థలోని సంబంధిత చట్టాలుభారత న్యాయ సంహిత , అక్రమ రవాణా నిరోధక చట్టం , పిల్లల రక్షణ చట్టం, బాల్యవివాహ నిషేధ చట్టం , సఖి కేంద్రాలు, భరోసా కేంద్రాలు, చైల్డ్ లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నంబర్లు (1098, 100, 181, 1930) గురించి వివరించారు. బాలబాలికలపై జరుగుతున్న లైంగిక నేరాలపై, వారిని ఎలా గుర్తించాలి, ఎలా రక్షించాలి అనే అంశాలపై చర్చ జరిగింది. పిల్లలతో ఎలా వ్యవహరించాలి, వారిలో నమ్మకాన్ని ఎలా పెంపొందించాలి అనే అంశాలపై ఉపాధ్యాయులకు మార్గదర్శనం అందించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మొండయ్య, అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి అశోక్ రెడ్డి, ప్రజ్వల కోఆర్డినేటర్ అంబర్ సింగ్, ప్రజ్వల సిబ్బంది కృష్ణవేణి, టీజీఎంఎస్ ప్రతినిధి సయ్యద్ ఇర్షాద్ అలీ, జిల్లా పాఠశాలల నుండి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి మోదీ పర్యటను విజయవంతం చేయాలి...




**పత్తికొండ అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నేడు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్నారని బిజెపి పార్టీ జిల్లా కళాకారుల అధ్యక్షుడు డాక్టర్ ఎస్,రామ్మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆటోలు తిరుగుతూ ప్రచారం చేశారు.అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పర్యటన" సందర్భంగా వస్తున్నారని ప్రధాని మోదీ మన కర్నూలు జిల్లాకు వస్తుండటం గర్వకారణం అన్నారు.దేశవ్యాప్తంగా జీఎస్టీ తగ్గిన తర్వాత మొట్టమొదటిసారిగా కర్నూలు జిల్లాకు వస్తుండటం మనందరికీ శుభసూచకం అన్నారు.జీఎస్టీ తగ్గింపుతో సాధారణ ప్రజలకు,వ్యాపార వర్గాలకు ఊరట లభించింది.ప్రజలందరూ స్వదేశీ ఉత్పత్తులను వినియోగించి 'వికసిత్ భారత్'లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారని అన్నారు.కావున బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్ని మోదీ పర్యటనను విజయవంతం చేయాలన్నారు

# ముత్యాలమ్మ దేవాలయ అభివృద్ధికి సుంకిరెడ్డి తోడ్పాటు

**తలకొండపల్లి, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామ పంచాయతీ కర్కాస్ తండాలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మరియుటాస్క సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటించారు. తండాలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం, నిర్మాణంలో ఉన్న ముత్యాలమ్మ దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన పూజలో పాల్గొని, దేవాలయ అభివృద్ధికి తన వంతు తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. వాటిని భవిష్యత్తు తరాలకు అందించడం మన బాధ్యత. గత మూడు సంవత్సరాల్లో నియోజకవర్గవ్యాప్తంగా 160కి పైగా దేవాలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ ద్వారా సహకారం అందించాం," అని తెలిపారు. కర్కాస్ తండా పర్యటనలో భాగంగా, తండావాసుల కోరిక



మేరకు ముత్యాలమ్మ దేవాలయానికి గ్రిల్స్ నిర్మాణం, పెయింటింగ్ పనుల పూర్తికి హామీ ఇచ్చారు. తండా ప్రజలు అందించిన ఆత్మీయ స్వాగతానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, తండావాసులు మాట్లాడుతూ, "మా ఆహ్వానం మేరకు వెంటనే విచ్చేసి, దేవాలయ అభివృద్ధికి పెద్ద మొత్తంలో సహకారం అందించిన సుంకిరెడ్డి గారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం," అని తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మాజీ సర్పంచ్‌లు బొజ్జ వెంకట్రాం రెడ్డి, శంకర్ నాయక్, గంగ నరసింహ, మాజీ ఉప సర్పంచ్‌లు రవి, కరుణాకర్ రెడ్డి, స్థానిక నాయకులు గోపాల్ నాయక్, శ్రీను, శివాజీ, మల్లేష్, యువజన నాయకులు రాజేందర్, నర్య, సంతోష్, చిన్న కృష్ణ, బాలకోటి, దేవేందర్, అంజ్య, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుని ఎంపికలో కార్యకర్తల అభిప్రాయమే కీలకం

### శ్రీనివాస్ మనె




**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష నియామక ప్రక్రియలో భాగంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసీసీ పరిశీలకులు, టీపీసీసీ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. కర్ణాటక ఎమ్మెల్యే శ్రీనివాస్ మనె మాట్లాడుతూ, "జిల్లా అధ్యక్ష పదవికి నామినేటెడ్ పద్ధతికి బదులుగా క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాన్ని సేకరించి, ప్రజలకు అందుబాటులో ఉండగల, సమన్వయకర్తగా పనిచేయగల నాయకుడిని ఎంపిక చేయడం లక్ష్యంగా ఈ ప్రక్రియ చేపట్టాం," అని తెలిపారు. ఇప్పటికే ఐదు రాష్ట్రాల్లో విజయవంతమైన ఈ విధానం, తెలంగాణలో ఆరో రాష్ట్రంగా అమలవుతోంది. ఈ సమావేశంలో మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రహమతు హుస్సేన్, ఇతర నేతలు పాల్గొన్నారు. అభిప్రాయ సేకరణ అనంతరం నివేదికను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి అందజేస్తారు. విలేకరుల సమావేశంలో పీసీసీ కోఆర్డినేటర్ బాలకృష్ణ, నాయకులు పద్మాకర్ రెడ్డి, శ్రీరామ్ చక్రవర్తి, తాజ్, ఆంజనేయులు గౌడ్, సత్య ప్రసన్న రెడ్డి, శ్రావణ్ నాయక్, అరుణ్ కుమార్, మధు, రాజేశం, కృష్ణారెడ్డి, ముస్తాక్, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంపై కలెక్టర్ ఆగ్రహం



**సిద్దిపేట, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిద్దిపేట రూరల్ మండలంలోని తోర్నాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కామన్ డైట్ మెనూకు విరుద్ధంగా ఆలుగడ్డ టమాటా కూర, పచ్చిపులుసు మాత్రమే వండినందుకు వంట సిబ్బందిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌష్టికాహారం అందించాల్సిన మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. సరిపడినంత కూర లేకపోవడంతో మళ్లీ వండాలని ఆదేశించారు. ఫుడ్ ఇంచార్జ్ హాజరు ప్రకారం సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఫోన్ ద్వారా ఆదేశించారు. అంతకుముందు దుబ్బాక మండలం తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య మహిళా శిబిరాన్ని పరిశీలించి, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు.

## వార్డు కార్యాలయాన్ని సందర్శించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**అల్విన్ కాలనీ, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శంశిగూడా వార్డు కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బందితో సమావేశమయ్యారు. ఉచిత కరెంట్, గ్యాస్ పథకాల లబ్ధి కోసం ప్రజలు అధికంగా వస్తున్నారని, కొత్త రేషన్ కార్డు పొందినవారు జీరో బిల్ పథకాన్ని వినియోగించుకుంటున్నారని సిబ్బంది వివరించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారికి తగిన సూచనలు, సేవలు అందించాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అనిల్ రెడ్డి, లింగం, సత్తయ్య, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి పదవి బీసీలకు ఇవ్వాలి: జేఏసీ

**హాలియా, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లా డీసీసీ అధ్యక్షులుగా మా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కాంగ్రెస్ పార్టీకి నమ్మిన బంటు గౌని రాజా రమేష్ కి ఇవ్వాల్సిందిగా నాగార్జునసాగర్ గిరిజన బిడ్డల తరుపున మరియు గిరిజన జేఏసీ తరుపున కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి వేడుకుంటున్నాము.



## 11వ వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతి



**ఆమనగల్లు, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు సమస్యల పరిష్కారానికి సంబంధించి కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వీధి దీపాలు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. వీధి దీపాల విషయంలో ఎలక్ట్రీషన్ శ్రీను నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఆయనను మార్చాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బైకని యాదమ్మ, శ్రీశైలం యాదవ్, బీజేపీ 185 బూత్ అధ్యక్షుడు బైకని అశోక్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సముద్రాల వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు తోట నరసింహ యాదవ్, జగదీశాచారి, ఎర్రవోలు యాదయ్య, కావాటి వెంకటయ్య యాదవ్, దుడ్డు పర్వతాలు, బైకని శేఖర్, మంగలి వినయ్, బంటి యాదవ్, తోట రాజు, కృష్ణయ్య, రంగయ్య, పూల వెంకటేష్, బండ్ల నారాయణ, గంజి శీను, ఎడెల్లి శివ, ఈశ్వరయ్య, నారమోని యాదయ్య, జంగయ్య, ఆరిఫ్, మంగలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్వో కార్యాలయం ముందు యువకుడి ఆత్మహత్యయత్నం

**దుండిగల్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గాగిల్లాపూర్ తండాకు చెందిన యువకుడు సిద్దూ (27) దుండిగల్ గండిమైసమ్మ ఏంఆర్ఓ కార్యాలయం ముందు ఆత్మహత్యయత్నం చేశాడు. తన భూమిని ఓ నిర్మాణ సంస్థకు కట్టబెట్టేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ, హద్దులు ఏర్పాటు చేయాలని వినతులు చేసినా 6 లక్షలు డిమాండ్ చేశారని యువకుడు ఆరోపించాడు. భూమిపత్రాలు చేతపట్టి కార్యాలయం ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నం చేసినట్లు సమాచారం.


## బొట్టుగూడ పాఠశాలకు "కోమటి రెడ్డి ప్రతీక్" పాఠశాలగా నామకరణం

### -రూ.8 కోట్లతో నిర్మాణం
### - మంత్రి వెంకట్ రెడ్డి

**నల్లగొండ, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లా బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలకు "కోమటి రెడ్డి ప్రతీక్ ప్రభుత్వ పాఠశాల"గా రాష్ట్ర ప్రభుత్వం నామకరణం చేసింది. శిథిల భవనాన్ని తొలగించి, రూ. 8 కోట్ల వ్యయంతో కోమటి రెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధునిక సౌకర్యాలతో నూతన భవనం నిర్మించారు. పాఠశాల ప్రారంభోత్సవాన్ని త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని, నియోజకవర్గంలోని అన్ని విద్యాసంస్థలను మోడల్ స్థాయికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.



## వెంకట్రావుపల్లి పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



**రామడుగు, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వెంకట్రావుపల్లిని మండల విద్యాధికారి రంగనాథ శర్మ ఆకస్మికంగా సందర్శించారు. ఉదయపు ప్రార్థనలో పాల్గొని, విద్యార్థులు యూనిఫామ్ ధరించి క్రమంగా హాజరుకావాలని సూచించారు. పాఠశాల భౌతిక వనరులు, కిచెన్ గార్డెన్, కూరగాయ మొక్కలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. తరగతిగదుల్లో బోధనను గమనించి, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల స్పందనపై ప్రశంసలు తెలిపారు. ఈ సందర్శనలో ప్రధానోపాధ్యాయులు శ్యామదత్తు, ఉపాధ్యాయులు ఆంజనేయులు, కరుణాకర్, రవీందర్, గీతా, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ లపై బంద్ కు సిపిఐ సంపూర్ణ మద్దత్తు

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**మేడ్చల్ , అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )** బీసీ రిజర్వేషన్ లను అమలు చెయ్యాలని ప్రజలంతా కోరుతున్న సందర్భంలో బీసీ రిజర్వేషన్ లపై హైకోర్టు స్టే ఇవ్వడం తగదని వెంటనే రిజర్వేషన్ లను కల్పించాలని కోరుతూ ఈ నెల 18 నాడు బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన బంద్ లో సిపిఐ జిల్లా శ్రేణులన్నీ పాల్గొని జయప్రదం చెయ్యాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ లు అమలు చెయ్యాలని ప్రజలు రాష్ట్రాలు కోరుతుంటే బీజేపీ ప్రభుత్వం నిమ్మకనిరేతినట్లు వ్యవహారిస్తుందని అన్నారు, ఇప్పుడు బీజేపీ అసలు స్వరూపం బయటపడుతుందని అన్నారు. అగ్రవర్ణ కులాల వెనుకబడిన వారికీ ఏ రాష్ట్రం కానీ,ప్రజలు కానీ అడగలేదని, ఎక్కడా ధర్నాలు కానీ నిరసనలు జరగలేదని కానీ బీజేపీ ప్రభుత్వం 10 శాతం కూడా లేనివారికీ 10 శాతం రిజర్వేషన్ లు ఇచ్చి పార్లమెంట్ లో అమోదింప చేసుకొని సుప్రీమ్ కోర్టు విధించిన 50 శాతం పరిమితి కూడా మించిపోయిందని,ఇది బీజేపీ కి అగ్రవర్ణాలకు ఇచ్చే సహకారమని కానీ బీసీ లు అడిగితే మాత్రం చెయ్యట్లేదని ఇప్పటికైనా బీజేపీ నాటకాలు మానేసి బీసీ బిల్లును పార్లమెంట్ లో అమోదించాలని లేకపోతే బీసీ లు బీజేపీ ని రానున్న ఎన్నికల్లో తిరస్కరిస్తారని అన్నారు. బీసీ రిజర్వేషన్ లు అమలు అయ్యేంత వరకు సిపిఐ కార్యకర్తలు పోరాటాలకు నాయకత్వం వహించాలని కోరారు.



# కంది, మొక్కజొన్న, వేరుశెనగ కొనుగోలు కేంద్రాలకు అనుమతించాలి

## ఆమనగల్లు మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా




**కడ్తాల్, అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : అమనగల్లు మార్కెట్ యార్డ్ లో కంది, మొక్కజొన్న, వేరుశెనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతించాలని రాష్ట్ర వ్యవసాయ ,మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మార్కెట్ చైర్పర్సన్ యాట గీత నర్సింహా ముదిరాజ్ కోరారు. మంగళవారం ఈ మేరకు సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేక రైతులు దిగుబడిని అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యంగా ఉండడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ యార్డ్ కు కూడా కొనుగోలు కేంద్రాల ద్వారా ఆదాయం లభిస్తుందని గీత నరసింహ వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా అనుమతిస్తామని తెలిపినట్లు గీతా నర్సింహా చెప్పారు. సీజన్ ప్రారంభం వరకు ఆయా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతామని అన్నారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో పలు అభివృద్ధి పనులకు, రైతులకు సౌకర్యాలు కల్పనకు , యార్డు పరిధిలోని కడ్తాల్ లో గోదాముల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా 100 శాతం సబ్సిడీపై రైతులకు అందజేసే మేలు రకం వేరుశనగ విత్తనాల పంపిణీని కార్యక్రమంలో మార్కెట్ చైర్పర్సన్ పాల్గొన్నారు. మంత్రితో కలిసి తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. అధిక దిగుబడులను ఇచ్చే నూనే గింజల పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని మంత్రి తెలిపినట్లు గీత నరసింహ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి పిఏసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు నింగారి కృష్ణయ్య దుర్గని జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూముల పరిరక్షణ సమితి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా గంటీల వెంకటేష్ నియామకం



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 14( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా రంగారెడ్డి జిల్లా,ఇబ్రహీంపట్నం మండలం,పోల్కంపల్లి గ్రామానికి చెందిన గంటీల వెంకటేష్ మంగళవారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా గంటీల వెంకటేష్ మాట్లాడుతూ... తన నియామకానికి సహకరించిన భూముల పరిరక్షణ సమితి చైర్మన్ పల్లపు విజయ్,రాష్ట్ర అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్,ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు మచ్చ జంగయ్య కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా గంటీల వెంకటేష్ కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## ఏసీబీ వలలో లైన్మెన్ నాగేందర్



**వంగూర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూర్ మండల కేంద్రంలో ట్రాన్స్ఫార్మర్ షిఫ్ట్ కోసం రైతు నుంచి 15,000 లంచం తీసుకుంటుండగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న లైన్మెన్ నాగేందర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. మంగళవారం రైతు నుంచి లంచం తీసుకునే సమయంలో పకడ్బందీగా కాపుకాసిన అధికారులు నాగేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సూచించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యార్థుల సమస్యలపై సమీక్ష నిర్వహించారు.పాఠశాలల యాజమాన్యం విద్యార్థులను బకాయిల పేరుతో అవమానిస్తే ఉపేక్షించబోమని, అట్టి పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. వసతుల కల్పన ప్రభుత్వ నిబంధనల మేరకు జరుగుతున్నదా అనే అంశంపై తనిఖీలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో 8 పాఠశాలల్లో 208 మంది, సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9 పాఠశాలల్లో 1159 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వసతి, భోజనం, విద్యా సౌకర్యాలు సమృద్ధిగా అందుతున్నాయని, పాఠశాలల నిర్వహణ సక్రమంగా సాగుతోందని వివరించారు. పాఠశాలల పనితీరు మెరుగుపరచేందుకు వ్యక్తిగతంగా పర్యటనలు నిర్వహిస్తున్నానని, అవసరమైన సదుపాయాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నానని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ఫిరంగి, మైనార్టీ సంక్షేమ అధికారి గోపాల్ నాయక్, పర్యవేక్షకురాలు రాగమని, కవిత తదితరులు పాల్గొన్నారు.

## క్యూనెట్ స్కామ్‌లో యువకుడి ఆత్మహత్య

### ఇద్దరు అరెస్ట్




**సిద్దిపేట, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** క్యూనెట్ నెట్‌వర్క్ పెట్టుబడి స్కామ్‌లో రూ.8 లక్షలు పోగొట్టుకున్న సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం వెల్లూరు గ్రామానికి చెందిన హరికృష్ణ (26) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఒత్తిడి, మానసిక క్షోభతో అక్టోబర్ 9న తన నివాసంలో సూసైడ్ నోట్ రాసి ఉరి వేసుకున్నాడు.తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని హామీ ఇచ్చి హరికృష్ణను ఆకర్షించిన కల్వల మణికంఠరెడ్డి (మెదక్) మరియు ఉప్పలపు అలేఖ్య (చెట్ల గౌరారం) అనే ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.హరికృష్ణ 4 లక్షలు చెల్లించి క్యూనెట్ సభ్యత్వం తీసుకున్నాడు. 'ట్రిప్ సేవర్' కూపన్, చేతి గడియారం అందుకున్నాడు. తరువాత హైదరాబాద్లో జరిగిన సెమినార్లకు హాజరయ్యాడు. నిజమైన అమ్మకాలు లేకుండా ఇతరులను నియమించాల్సిన పిరమిడ్ తరహా స్కీమ్ అని గ్రహించిన తర్వాత తీవ్ర నిరాశకు గురయ్యాడు. పోలీసు కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్ మాట్లాడుతూ, క్యూనెట్ వంటి మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ మోసపూరితమైనవని, 1978 నిషేధ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. "ఆన్‌లైన్ పెట్టుబడి పథకాల బారిన పడవద్దు. అనుమానాస్పద కార్యకలాపాలను 1930, 100 లేదా 8712667100కు తెలియజేయండి" అని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.

## సమర్థులకే నాయకత్వ బాధ్యతలు

### ఏఐసీసీ పరిశీలకుడు శ్రీనివాస్



**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా, బ్లాక్, మండల స్థాయిల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు సమర్థుల ఎంపికే 'సంఘటన్ సృజన్ అభియాన్' లక్ష్యమని ఏఐసీసీ పరిశీలకుడు మానే శ్రీనివాస్ తెలిపారు.ఎల్ఎండీ కాలనీలోని అరుంధతీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక కోసం నిర్వహించిన అభిప్రాయ సేకరణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామస్థాయిలో పార్టీ నిర్మాణ బాధ్యతలు జిల్లా అధ్యక్షులకే అధికంగా ఉండటంతో, సమర్థత గల నాయకునికే బాధ్యతలు అప్పగించాలన్నదే అధిష్టానం ఉద్దేశమని చెప్పారు.టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ, కష్టకాలంలో పార్టీ కోసం శ్రమించినవారిని కాంగ్రెస్ తప్పకుండా ఆదరిస్తుందని, కార్యకర్తల కృషితోనే నేతలు ఎదుగుతారని పేర్కొన్నారు. వ్యక్తిగత విషయాలకు దూరంగా, పార్టీ పటిష్టత కోసం కలిసికట్టుగా పనిచేయాలని హితవు పలికారు. సభాధ్యక్షుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల గొంతుకగా పనిచేస్తోందని, పారదర్శకంగా అధ్యక్షుని ఎంపిక జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి చిట్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఏఐసీసీ పరిశీలకులు కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

### కలెక్టర్ పమేలా



**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యువత భవిష్యత్తును కాపాడేందుకు మత్తు పదార్థాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్ల పక్కన పాన్ షాపుల్లో తనిఖీలు చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిత్యం గమనించాలని సూచించారు. సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ, హాస్టళ్లు, కార్గో, పార్సిల్ సంస్థల గోదాముల్లో తనిఖీలు కొనసాగుతున్నాయని, డ్రగ్ డిడక్షన్ కిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం నశా ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్ ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రమేష్ బాబు, డీడబ్ల్యూఓ సరస్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ సేవల అమలును సమీక్షిస్తూ, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మల్కాపూర్ 2వ అంగన్వాడీ కేంద్రం మరియు విద్యానగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.మల్కాపూర్ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల శారీరక వృద్ధిని క్రాస్ చెక్ చేసి, రోజు వారీ మెనూ, హాజరు నమోదు, గర్భిణీ మరియు బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని, అందరికీ పౌష్టికాహారం తప్పకుండా అందించాలని సూచించారు. కేంద్ర నిర్వహణపై తగు సూచనలు చేశారు. అనంతరం విద్యానగర్‌లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యు -పి హెచ్ సి) సందర్శించిన ఆమె, ఓపిడి, ఎన్‌సిడి, ఆరోగ్య మహిళ, ఐఎల్‌ఆర్, ఫార్మసీ సేవలను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సూచనలు చేశారు.

## జెన్‌జెడ్ రిప్రొడక్షన్ అంశంపై అవగాహన




**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో హెల్త్ క్లబ్, రెడ్డీస్ లాబొరేటరీ ఆధ్వర్యంలో 'రిప్రొడక్షన్ కన్సర్న్ – జెన్‌జెడ్' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డా. ప్రతిష్ట రావు మహిళల్లో రొమ్ము క్యాన్సర్, పీ.సి.ఓ.డి. సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ డా. నాజియా రెహమాన్, జే. అనిత, డి. స్వరూప రాణి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## "సంఘటన్ శ్రీజన్ అభియాన్"లో పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు జయ కుమార్



**మంథని, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లోక్ సభాపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో మంథని నియోజకవర్గంలోని నరసింహ శివకిరణ్ గార్డెన్స్‌లో "సంఘటన్ శ్రీజన్ అభియాన్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, ఏఐసీసీ పరిశీలకులు డా. కే. జయ కుమార్, కేతురి వెంకటేష్, ఖాజా ఫక్రుద్దిన్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ రాజేష్ కాశీపాక పాల్గొన్నారు. పార్టీ శ్రేణుల మెజారిటీ ఆధారంగా పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, మంథని, అంతర్గం మార్కెట్ కమిటీ చైర్మన్, ధర్మారం, రామగుండం మండల అధ్యక్షులు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులను ప్రకటించారు. పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఎస్సి, బీసీ సంఘాల నాయకులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు భారీ సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

## మానవత్వం చాటుకున్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే




**సిరిసిల్ల, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే మానవత్వాన్ని చాటుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని బైపాస్ వద్ద ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని గమనించిన ఆయన, తక్షణమే తన వాహనాన్ని ఆపి, పైలెట్ వాహనంలో బాధితుడిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవడంతో బాధితుడి ప్రాణాలు కాపాడబడ్డాయి. ఎస్పీ స్పందనపై స్థానిక ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. పోలీసు అధికారి నుంచి వచ్చిన ఈ మానవీయ స్పందనకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వెంటనే ప్రారంభించాలి: బీఎస్పీ



**హుస్నాబాద్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న కోతలు ప్రారంభమై పదిరోజులు గడుస్తున్నా, హుస్నాబాద్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడం బాధాకరమని బీఎస్పీ పార్టీ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు 2400 ఉండగా, మార్కెట్ యార్డ్ పరిధిలో 2000కే కొనుగోలు జరుగుతోందని తెలిపారు. లైసెన్స్ గల ట్రేడర్లు మార్కెట్ యార్డ్‌లోనే కొనుగోలు చేయాల్సి ఉన్నా, తమ షాపుల్లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను నష్టపెట్టుతున్నారని విమర్శించారు. ఒక ఎకరానికి 25 -30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, క్వింటాల్‌కు 300 నష్టంతో ఒక్క ఎకరానికి 6000 నష్టం జరుగుతోందని వివరించారు. అలాగే, సీసీఐ కొనుగోలు కేంద్రం సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో పత్తి రైతులు కూడా 8100 మద్దతు ధరకు బదులుగా 6000కే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే మొక్కజొన్న, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని బీఎస్పీ పార్టీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే, రైతుల పక్షాన తీవ్ర ఆందోళనకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు, జిల్లా నాయకులు ఎలగందుల శంకర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన నూనె దివాకర్




**హుస్నాబాద్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు మైత్రి గార్డెన్స్‌లో అక్టోబర్ 13న నిర్వహించిన 69వ ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి 14 సంవత్సరాల బాలుర కబడ్డీ పోటీల్లో హుస్నాబాద్ విద్యార్థి నూనె దివాకర్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర), హుస్నాబాద్‌లో 8వ తరగతి చదువుతున్న దివాకర్, సిద్దిపేట జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ మెదక్ జిల్లా జట్టులో స్థానం సంపాదించాడు. ఈ నెల 16 నుండి 18వ తేదీ వరకు పటాన్ చెరువులో నిర్వహించనున్న 69వ రాష్ట్ర స్థాయి పాఠశాలల కబడ్డీ పోటీల్లో ఆయన పాల్గొననున్నాడు. దివాకర్ ఎంపికపై పాఠశాల పిడి ఆర్ శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడేమ్ లింగమూర్తి, హుస్నాబాద్ ఎంఈఓ బండారి మనీలా, ప్రధానోపాధ్యాయులు కే. వాసుదేవ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కోచ్ కృష్ణ, పి.ఈ.టీలు రాజేష్, రాకేశ్, సీనియర్ క్రీడాకారులు గద్దల రమేష్, సాయి కృష్ణ అభినందనలు తెలిపారు.

## గిన్నిస్ రికార్డు విజేతలను అభినందించిన కమిషనర్ గౌస్ ఆలం




**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చెన్నై, తమిళనాడు సీవత్ కాలేజ్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన కరీంనగర్ జిల్లాకు చెందిన అన్వర్ ఖాన్, అర్మాన్ ఖాన్, ఫర్హాన్ ఖాన్‌లను జిల్లా పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఐ.పి.ఎస్. అభినందించారు .కమిషనర్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌస్ ఆలం వారిని సర్టిఫికేట్లు, మెడల్స్ అందించి శుభాకాంక్షలు తెలిపారు. "భవిష్యత్తులో దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు మరింత పేరు తీసుకురావాలి. చదువుతో పాటు కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో మరిన్ని గిన్నిస్ రికార్డులు సాధించాలి" అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐ.జి.కె.ఎ. గ్రాండ్ మాస్టర్ అక్బర్ ఖాన్, ఫహ్మిదా ఖాటూన్, వాయిస్ చైర్మన్ కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులను దోపిడీ చేస్తే సహించం: బీఆర్ఎస్



**హుస్నాబాద్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మండలం పందిల్లాలోని బాలాజీ కాటన్ మిల్లులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై పార్టీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ
"రైతులు ఎన్నో పెట్టుబడులు పెట్టి, కష్ట నష్టాలు ఓర్చుకొని పత్తి పంటను పండిస్తున్నారు. అయితే వ్యాపారులు తేమ శాతం, గింజల పేరుతో సాకులు చెప్పి క్వింటాల్‌కు ?8100 మద్దతు ధర ఉండగా కేవలం 4500 నుంచి 5500 మాత్రమే చెల్లిస్తున్నారు. దాదాపు 3000 తక్కువ చెల్లిస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి రైతులను దోపిడీ చేస్తే సహించేది లేదని, తక్షణమే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అని చెప్పుకుంటూ తిరుగుతున్నప్పటికీ, రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్కి రెడ్డి మోహన్ రెడ్డి, మేకల వికాస్ యాదవ్ పాల్గొన్నారు.

## చెంచు మహిళలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బల్మూరు మండల కేంద్రానికి చెందిన చెంచు మహిళలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పట్టాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రజా భవనంలో తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా అందజేశారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ**
"ఆదివాసుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. చెంచు ప్రజలు దట్టమైన అటవీ ప్రాంతాల్లో చిన్న గుడిసెల్లో నివసిస్తున్నారు. వారి నివాస ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి పేద కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తోంది. పేద ప్రజలను ఆదుకోవడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పనిచేస్తున్నారు" అని తెలిపారు. చెంచు మహిళలు తమ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మల్ రెడ్డి వెంకట్ రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ ఖదీర్, డిసిసి ప్రధాన కార్యదర్శి కాశన్న యాదవ్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన భూక్య శాన్వి



**హుస్నాబాద్, అక్టోబర్ 14 (లగిరి ఎక్స్‌ప్రెస్):**
69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీల్లో హుస్నాబాద్ నవభారత్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థిని భూక్య శాన్వి ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచింది. ఈ విజయంతో ఆమె రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. పాఠశాల కరస్పాండెంట్ గంగరవేణి రవి మాట్లాడుతూ "శాన్వి రాష్ట్ర స్థాయిలో రాణించి, జాతీయ స్థాయికి ఎదిగి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశిస్తున్నాం" అని హర్షం వ్యక్తం చేశారు. శాన్వి ఎంపికపై పాఠశాల ఉపాధ్యాయులు, శారీరక విద్యా ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## ఎన్జీ కళాశాల మైదానానికి ఆధునిక క్రీడా సౌకర్యాలు

### జిల్లా కలెక్టర్ త్రిపాఠి పరిశీలన



**నల్లగొండ, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానాన్ని ఆధునిక క్రీడా సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి త్రిపాఠి తెలిపారు. మంగళవారం ఉదయం ఆమె మైదానంలో నడక చేస్తూ సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు అనువైనతను స్వయంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కలెక్టర్ త్రిపాఠి గారు ఎన్జీ కళాశాల మైదానం నల్లగొండకు ఒక ప్రత్యేక గుర్తింపు అని పేర్కొన్నారు. మైదానాన్ని మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మున్సిపల్ మరియు జిల్లా యంత్రాంగాల నిధులతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా సింథటిక్ వాకింగ్ ట్రాక్, హైమాస్ లైట్లు, ప్రస్తుతం ఉన్న ఓపెన్ జిమ్‌కు మరమ్మతులు, అదనంగా ఓపెన్ జిమ్ ఏర్పాటుతో పాటు ఇతర అవసరమైన సౌకర్యాలను కల్పించే దిశగా దృష్టి సారిస్తున్నామని చెప్పారు. సంబంధిత అధికారులు అంచనాలు రూపొందించి సమర్పిస్తే, వాటిని త్వరితగతిన అమలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే మైదానం స్థలాన్ని ఎవరు ఆక్రమించకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ పరిశీలనలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, మున్సిపల్ కమిషనర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నల్లగొండ సదర్ సమ్మేళనానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఆహ్వానం



**నల్లగొండ ,అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఈనెల 25న నల్లగొండ ఎన్జీ కాలేజ్ గ్రౌండ్‌లో జరగనున్న సదర్ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని రాష్ట్ర రోడ్లు,భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని నల్లగొండ జిల్లా అఖిల భారత యాదవ సంఘం నాయకులు డా.బి.ఆర్.అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్‌లో కలిసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. సదర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు..ఆహ్వానించిన వారిలో జిల్లా అధ్యక్షుడు ఏడు కొండలు,మాజీ కౌన్సిలర్ అల్లి సుభాష్ యాదవ్,మద్ది శ్రీనివాస్ యాదవ్,గంగుల చందు వంశీ యాదవ్,బెల్లి నాగరాజు యాదవ్,చినబోయిన వెంకన్న యాదవ్,గుండబోయిన వెంకన్న యాదవ్,శివ,వంశీ,లింగయ్య,లక్ష్మణ్ తదితరులు ఉన్నారు..

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ త్రిపాఠి



**నల్లగొండ, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ శ్రీమతి త్రిపాఠి మంగళవారం కనగల్ మండలంలోని దొరేపల్లి గ్రామంలో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దొరేపల్లి కేంద్రానికి పెద్ద మొత్తంలో ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున, కొనుగోలు కేంద్రానికి విశాలమైన స్థలాన్ని ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.రైతులు తమ కళ్లముందే ధాన్యాన్ని ఆరబెట్టి, ఎలాంటి తాలు, తరుగు లేకుండా నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఆమె కోరారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అకాల వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, వర్ష సూచన ఉన్న రోజుల్లో ధాన్యంపై టార్పాలిన్‌లు కప్పి ఉంచాలని సూచించారు. తగినంత తేమ శాతం వచ్చిన తర్వాతనే ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి రోజు తేమ శాతం వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అలాగే, సీరియల్ నంబర్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, తేమ ఎక్కువగా లేకుండా ఉన్న ధాన్యాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు.

## బీజేపీ కార్యకర్త జల్కకం శేఖర్‌కు నివాళులర్పించిన తల్లోజు ఆచారి

### కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, అండగా ఉంటామని హామీ



**కద్తాల్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కద్తాల్ గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ కార్యకర్త జల్కకం శేఖర్ (36) రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషాద ఘటనతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈరోజు కద్తాల్ మండల కేంద్రంలో జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో బీజేపీ నాయకుడు శ్రీ తల్లోజు ఆచారి గారు పాల్గొన్నారు. అంత్యక్రియల అనంతరం ఆయన శేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని, పార్టీ తరఫున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తగా శేఖర్ చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

## నేడు అమ్రాబాద్ లో పర్యటించనున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
టీపీసీసీ ఉపాధ్యక్షులు మరియు అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ నేడు ఉదయం 11 గంటలకు అమ్రాబాద్ మండల కేంద్రంలో పర్యటించనున్నారని అచ్చంపేట ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు చింతల రాజగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## 72 గంటల నిరసనతో ప్రభుత్వాన్ని హెచ్చరించిన డైలీ వేజ్ వర్కర్లు

**అమ్రాబాద్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలోని ఐటిడిఏ కార్యాలయం ఎదుట డైలీ వేజ్ వర్కర్లు 72 గంటల నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీవో నెంబర్ 64 రద్దు చేయాలి, టైమ్ స్కేల్ అమలు చేయాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి అనే ప్రధాన డిమాండ్లతో వారు ఉద్యమాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 32 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే హైదరాబాద్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ నాయక్ హాజరై, ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆయన



మాట్లాడుతూ, "గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ట్రైబల్ హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలల్లో 35 సంవత్సరాలుగా సేవలందిస్తున్న డైలీ వేజ్ వర్కర్లకు జీవో 64 ద్వారా వేతనాలు తగ్గించడం దుర్మార్గం. ప్రభుత్వం వెంటనే ఈ జీవోను రద్దు చేయాలి. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి లేదా టైమ్ స్కేల్ అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యురేనియం వ్యతిరేక పోరాటం నాయకుడు కల్ముల నాసరయ్య, పౌర హక్కుల సంఘం నాయకులు బాలయ్య, లక్ష్మీనారాయణ, వెంకటేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ నాయకులు సురేందర్, భరతు, పర్వతాలు, హెూమ్ ప్రకాష్, ఎల్లమ్మ, పద్మ, నీల, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సయ్యద్, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శివ ప్రచండ తదితరులు మద్దతుగా పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

## మాజీ సర్పంచ్ కుందూరు భీష్మారెడ్డి చిత్రపటానికి వన్నాల వెంకటరమణ నివాళి



**రాయపర్తి, అక్టోబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మాజీ సర్పంచ్ కుందూరు భీష్మారెడ్డి దశదినకర్మకు హాజరై ఆయన చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ నివాళు లర్పించారు.రాయపర్తి మండలం సన్నూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుందూరు భీష్మారెడ్డి ఇటీవల మృతి చెందాడు.మంగళవారం వారి దశ దినకర్మ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ హాజరై వారి చిత్రపటానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు - మాజీ మేయర్ తక్కలపల్లి రాజేశ్వర్ రావు , మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు,మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ , జిల్లా ఉపాధ్యక్షులు ఏకాంతం గౌడ్ , జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రావు, వర్ధన్నపేట మాజీ మండల అధ్యక్షులు కుమార స్వామి, మాక్స్ కేర్ కుందూరు కరుణాకర్ రెడ్డి, బీజేవైఎం నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు సద్వినియోగం చేసుకోండి

### పశుసంవర్ధక శాఖ



**అమరాబాద్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించి ప్రత్యేక టీకా కార్యక్రమం అమరాబాద్ మండలంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 15 (బుధవారం) మరియు 16 (గురువారం) తేదీల్లో జరుగనుంది. ఈ సందర్భంగా పశువైద్య సహాయక శస్త్ర చికిత్సకులు డా. వి. రాజు మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులకు వ్యాధినివారణ టీకాలు వేయించుకోవాలని, మా పశు వైద్య సిబ్బంది గ్రామానికి వచ్చినపుడు అందుబాటులో ఉండాలని కోరారు. గాలికుంటు వ్యాధి పశువులకు తీవ్రమైన నష్టం కలిగించే అవకాశం ఉన్నందున, ఈ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవడం ద్వారా పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ పశువులను రక్షించుకోవాలని పశు సంవర్ధక శాఖ విజ్ఞప్తి చేసింది.

## ఓట్ చోరీ వ్యతిరేకంగా మహేశ్వరం నియోజకవర్గంలో భారీ సంతకాల సేకరణ

### కందుల సమతా ప్రకాష్ నేతృత్వంలో 10 వేల పైచిలుకు సంతకాలు

**రంగారెడ్డి, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఓటు చోరీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న పోరాటానికి మద్దతుగా మహేశ్వరం నియోజకవర్గంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కందుల సమతా ప్రకాష్ నేతృత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది.తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు పిలుపు మేరకు, జిల్లా




అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ సూచనలతో ప్రతి గ్రామంలో 100 సంతకాలు సేకరించేందుకు కార్యాచరణ చేపట్టారు. ఈ క్రమంలో మహేశ్వరం నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యధికంగా సంతకాల సేకరణ చేసిన జిల్లాగా గుర్తింపు పొందింది. మొత్తం 10 వేల పైచిలుకు సంతకాలు సేకరించినట్టు సమతా ప్రకాష్ తెలిపారు. ఈ సంతకాల లిస్టును ఈరోజు గాంధీభవన్‌లో రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్‌కు అందజేశారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ అధ్యక్షురాలు అమృత నాయుడు, మీర్పేట్ అధ్యక్షురాలు పద్మశ్రీ, కందుకూరు మండల అధ్యక్షురాలు కవితా రెడ్డి, సుశీల, ప్రభావతి, రవళి, సంగీత, అరుణ, రమాదేవి, రజిత తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంథని బ్రిడ్జి, రింగ్ రోడ్ పనులపై సమీక్ష

### ఆర్ అండ్ బి, రెవెన్యూ అధికారులతో మంత్రి సమీక్ష

**మంథని, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంథని పట్టణంలోని గోదావరి బ్రిడ్జి పనులు, శ్రీపాద రింగ్ రోడ్ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్షలో తెలంగాణ రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రివర్యులు పాల్గొని, ఆర్ అండ్ బి, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు సంబంధిత కంపెనీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు గోదావరి బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని, శ్రీపాద రింగ్ రోడ్ పనులను తక్షణమే



ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.50 కోట్లతో మంజూరైన ఆర్ అండ్ బి అతిథిగృహానికి తగిన స్థలాన్ని వెంటనే సేకరించి పనులు ప్రారంభించాలని సూచించారు. అలాగే మంథని మున్సిపాలిటీలో రూ.10 కోట్లతో మంజూరైన అన్ని కులాల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి స్థలం లేని చోట్ల ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి, వాటిని అందజేసి నిర్మాణ పనులు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. మంథనిలో హమాలీ సంఘం సభ్యులు, ఆటో కార్మికుల కోసం నివాస గృహాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి వారికి అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ, రెవెన్యూ డివిజన్ అధికారి, ఎమ్మార్వో, జేఈలు, సంబంధిత కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఉపాధ్యాయుడికి వరల్డ్ రికార్డులో స్థానం

అక్టోబర్ 16న పెద్దపల్లిలో జాబ్ మేళా




**పెద్దపల్లి, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన చిత్రకళ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ ప్రపంచ స్థాయిలో అరుదైన గుర్తింపు పొందారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 0.4 ఎం.ఎం పొడవు, 0.2 ఎం.ఎం వెడల్పుతో ప్రపంచంలోనే అతిచిన్న జాతీయ పతాకాన్ని గంటపాటు శ్రమించి రూపొందించినందుకుగాను ఆయనకు క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం లభించింది. ఈ పురస్కారాన్ని ముంబైలో ఆయన స్వీకరించారు. గతంలోనూ రజనీకాంత్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు అవార్డులను అందుకున్న ఘనత కలిగినవారు. ఇక మరోవైపు, పెద్దపల్లిలో అక్టోబర్ 16న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థ ద్వారా హైదరాబాద్లో ఫార్మసిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ కోసం ఈ మేళా నిర్వహించనున్నారు. మొత్తం 50 ఖాళీలను భర్తీ చేయనున్న ఈ అవకాశాన్ని బీ.ఫార్మసీ, డిప్లొమా ఫార్మసీ లేదా పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ఈనెల 16న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని రూమ్ నం.225లో హాజరుకావాలని ఆయన తెలిపారు.

## ఆటో సమస్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులకు వినతిపత్రం అందచేసిన ఆటో జేఏసీ రాష్ట్ర కమిటీ



**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి సంబంధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రామచందర్ రావుకు ఆటో జేఏసీ రాష్ట్ర కమిటీ వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ప్రతినిధులు ఆటో డ్రైవర్ల సంక్షేమానికి అవసరమైన పలు అంశాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రంలోని రైల్వే స్టేషన్లలో ఆటోలకు ఉచితంగా పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు. 2023 ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సంవత్సరానికి కాకుండా నెలనెలకు రూ.12,000 ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్య చేసుకున్న ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రస్తుతం ఉన్న రూ.8000 ఇన్సూరెన్స్‌ను రూ.1000కు తగ్గించాలని, ఆటో బీమా ఏర్పాటు చేసి మరణించిన డ్రైవర్ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ వినతిపత్రంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సానుకూలంగా స్పందించారు. రైల్వే స్టేషన్లలో పార్కింగ్ స్థలాల కేటాయింపు, ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్, చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, రాష్ట్ర నాయకులు నీలారపు రవి, జిల్లా కోశాధికారి లంకెల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల ఉపాధ్యక్షునిగా అమీర్పేట యాదగిరి ముదిరాజ్



**మహేశ్వరం, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండల కేంద్రానికి చెందిన పెద్దపులి నాగారం గ్రామస్తుడు అమీర్పేట యాదగిరి ముదిరాజ్‌ను బిజెపి మండల కమిటీలో ఏకగ్రీవంగా మహేశ్వరం మండల వైస్ ప్రెసిడెంట్గా నియమించారు. ఈ సందర్భంగా యాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ "బిజెపి పార్టీ బాధ్యతలు అప్పగించిన కమిటీ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సేవా దృక్పథంతో వినియోగించుకుంటాను. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో బిజెపి పార్టీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని నమ్మకం ఉంది. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లోనూ బిజెపి అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలిచి ముందుకు సాగతారని ఆశిస్తున్నాను," అని పేర్కొన్నారు.

## ఒప్పంద సేవల పద్ధతిలో పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూ

ఈ నెల 18న నస్పూర్‌లో నిర్వహణ - డా. ఎం. కోటేశ్వర్

**మంచిర్యాల, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని మంచిర్యాల జిల్లా ఆసుపత్రుల ప్రధాన అధికారి కార్యాలయంలో ఒప్పంద సేవల పద్ధతిలో పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులు డా. ఎం. కోటేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన వివరాల ప్రకారయి మొత్తం 8 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టు పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో 2 జనరల్ మెడిసిన్, 1 గైనకాలజిస్ట్, 2 అనస్తీషియాలజీ, 1 పల్మనరీ మెడిసిన్, 2 పీడియాట్రిక్స్ పోస్టులు ఉన్నాయి. అభ్యర్థులు ఎం.బి.బి.ఎస్.తో పాటు సంబంధిత స్పెషలిటీలో డిగ్రీ లేదా డిప్లమా కలిగి ఉండాలి. అలాగే మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లో నమోదు అయి ఉండటం తప్పనిసరి. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్ -24 లో గల జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయంలో పూర్తి ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని సూచించారు.

## పోగొట్టుకున్న రెండు ఫోన్లను బాధితులకు అప్పగించిన ఎల్ఎండి పోలీసులు



**మానకొండూర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీకి చెందిన పెండ్యాల సుధాకర్, చిగురుమామిడి మండలం ఇందుర్తికి చెందిన అనిల్ కుమార్ గత ఆరు నెలల క్రితం తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ ఫోన్లను గుర్తించిన ఎల్ఎండి పోలీసులు మంగళవారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి తిరిగి అందించడం పోలీసుల బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరిగినపుడు బాధితులు తమ ఫోన్ వివరాలను సీఐఈఆర్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇది గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## జిల్లా పంచాయతీ అధికారి ఆకస్మిక తనిఖీ

**కాటారం, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాటారం మండలంలో గంగారం గ్రామపంచాయతీ పరిధిలో జిల్లాపంచాయతీ అధికారి శ్రీలత ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ పరిధిలో ని రికార్డులు పరిశీలించి గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. కంఫర్ట్ ఎరువు తయారీ పరిశీలించి పల్లె ప్రగతి పనులను పరిశీలించి అనంతరం నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ ని ఆదేశించారు.

## మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "టొబాకో ఫ్రీ యూత్" అవేర్‌నెస్ కార్యక్రమం




**దేవరకొండ అక్టోబర్ 14.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఎ)లో ఎకనామిక్స్ కామర్స్ డిపార్ట్మెంట్స్ ఆధ్వర్యంలో టొబాకో ఫ్రీ యూత్ అనే కార్యక్రమాన్ని దేవరకొండ హెల్త్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యానికి టొబాకో వలన కలిగే నష్టాలు అలాగే గుండెపోటుకు గురైన వారికి సి పి ఆర్ ఎలా చేయాలో విద్యార్థులకు ప్రాక్టికల్ చేసి చూపించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి మాట్లాడుతూ ఇలాంటి అవేర్నెస్ కార్యక్రమాల వలన విద్యార్థులకు ఎంతగానో అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ, సూపర్వైజర్ సఫియా, హెల్త్ అసిస్టెంట్ వినోద్ కుమార్, లింగయ్య, ఇర్ఫాత్, ఆశ వర్కర్ సుమలత వైస్ ప్రిన్సిపాల్ జి. కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, కొండల్ ,హనుమ తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో అక్రమ ఇసుక రవాణా

- మూడు ట్రాక్టర్లు పట్టివేత
- బాలికపై అఘాయిత్యం
- నిందితులపై పోక్సో కేసు నమోదు




**కరీంనగర్, సెప్టెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మానేరు వాగు పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ శ్రీ నిరంజన్ రెడ్డి తెలిపారు. చేగుర్తికి చెందిన శ్రీనివాస్, దుర్శేడి గ్రామానికి చెందిన అన్వేష్, శ్రీనివాస్ నగర్‌కు చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తులు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుబడ్డారని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇక మరోవైపు, కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన ఘటన కలకలం రేపుతోంది. బాధిత బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్కు తరలించారు. అత్యాచార దృశ్యాలను యువకులు రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## కురుమిద్ద జాతి రత్నానికి ఉత్తమ సేవా పురస్కారం

- ఉత్కృష్ట అవార్డుకు హెూంగార్డు మూలి కృష్ణ ఎంపిక
- డీజీపీ శివధర్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం
- మూలీ కృష్ణ కు పురస్కారం పట్ల సర్వత్రా హర్షం
- కంద్ర హెూంమంత్రిత్వ శాఖ అవార్డుతో మరింత బాధ్యతగా విధులు






**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సత్యం, న్యాయం, ధర్మం కనిపించే ఈ మూడు సింహాలు చట్టానికి ప్రతీకలైతే కనిపించని ఆ నాలుగో సింహమే పోలీస్ అంటారు. పువ్వు పుట్టగానే పరిమళించిందన్న చందంగా అతి సామాన్య కుటుంబంలో పుట్టిన రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కురుమిద్ద గ్రామానికి చెందిన మూలి కృష్ణ చిన్న వయసులోనే పోలీస్ హెూంగార్డు వృత్తిలో చేరి శాంతి భద్రతల పర్యవేక్షణలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజలకు సేవలు అందించారు. వృత్తిని ఆరాధ్య దైవంగా భావించిన మూలి కృష్ణ విధుల్లో ఉత్తమ సేవలను గుర్తించిన ప్రభుత్వం కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ద్వారా ఉత్కృష్ట పథకం ఉత్తమ సేవా పురస్కారం అందజేసింది. ఈ పురస్కారం మెడల్ ను తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం మూలి కృష్ణకు అందజేసి అభినందించారు. ప్రజలకు సేవలందిస్తున్న యావత్ పోలీస్ లోకానికి హెూంగార్డు మూలి కృష్ణ స్వీకరించిన అవార్డు ఆదర్శం కాగలదని పేర్కొన్నారు. పలు సందర్భాల్లో విధుల్లో చాకచక్యంగా వ్యవహరించినందున ఈ పురస్కారం లభించిందని తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షిస్తూ కురుమిద్ద గ్రామ ప్రజలతో పాటు, స్నేహితులు, బంధువులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి వృత్తిలో ప్రతిభ కనబరుస్తూ, సుదీర్ఘ కాలంగా హెూంగార్డుగా బాధ్యతాయుతంగా పనిచేస్తూ అందరికీ కృష్ణ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వం తన వృత్తి సేవలను గుర్తించి అందించిన పురస్కారంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని మూలి కృష్ణ చెప్పారు. విధుల్లో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని అన్నారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం తాము ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఉత్కృష్ట పథకం అందిస్తున్నందుకు పోలీస్ శాఖ ఉన్నత అధికారులకు మూలి కృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

# జాతీయ అండర్ -23 అథ్లెటిక్ క్రీడల ఏర్పాట్లపై సమీక్ష

## ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఎమ్మెల్యే నాయిని ఆదేశం



**హనుమకొండ, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హనుమకొండ జవహర్ స్టేడియం వేదికగా ఈ నెల 16 నుంచి 18 వరకు జరగనున్న అండర్ -23 జాతీయ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ ఏర్పాట్లను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు కలిసి పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరవుతున్న నేపథ్యంలో, మంచినీరు, వైద్య సేవలు, పరిశుభ్రత, లైటింగ్ వంటి అవసరమైన సౌకర్యాలను సమకూర్చాలని మున్సిపల్ శాఖ అధికారులకు ఎమ్మెల్యే నాయిని సూచించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడా వేడుకల్లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. అథ్లెటిక్ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే నాయిని తెలిపారు. భద్రత పరమైన ఏర్పాట్లను పోలీస్ శాఖ పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అశోక్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఎంహెచ్ఓ రాజిరెడ్డి, ఈఈ రవీందర్, డీఈ సారంగం తదితర అధికారులు పాల్గొన్నారు.

# సి.ఎం.ఆర్. లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

**రైస్ మిల్లర్లతో సమీక్షలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచనలు**



**మంచిర్యాల, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. (సెంట్రల్ మిల్లింగ్ రికవరీ) లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, ఆయా మిల్లుల నిర్వాహకులు సమర్థంగా కృషి చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకుంటూ లక్ష్యాలను సాధించేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఖరీఫ్ 2025 -26 వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో, సి.ఎం.ఆర్. లక్ష్యాలను పూర్తి చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. బ్యాంకు గ్యారంటీ లేకుండా, డిఫాల్టర్‌గా ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించబోమని స్పష్టం చేశారు. అనంతరం రైస్ మిల్లుల వారీగా పెండింగ్‌లో ఉన్న లక్ష్యాల వివరాలను సమీక్షించి, వాటిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గోదావరిఖనిలో రూ.27 కోట్లతో షాపింగ్

**-కాంప్లెక్స్ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పర్యవేక్షణ**
**-నగర అభివృద్ధికి దోహదం, యువతకు ఉపాధి అవకాశాలు**



**రామగుండం, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఈరోజు గోదావరిఖని పట్టణం చౌరస్తా ప్రాంతంలో రూ.27 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతిని సమగ్రంగా తెలుసుకొని, పనుల నాణ్యత, వేగం, పారదర్శకతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "గోదావరిఖని ప్రజలకు ఆధునిక వాణిజ్య సదుపాయాలు కల్పించడమే ఈ షాపింగ్ కాంప్లెక్స్ లక్ష్యం. ఇది నగర అభివృద్ధికి తోడ్పడడమే కాక, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను పెంచుతుంది," అని పేర్కొన్నారు. ఇతర అభివృద్ధి పనులతో పాటు ఈ ప్రాజెక్టు నగర ముఖచిత్రాన్ని మార్చే స్థాయిలో ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, సింగరేణి మరియు మున్సిపల్ అధికారులతో సమన్వయం కలిగిన విధంగా ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పనుల ప్రగతిపై అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సూచించారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, మున్సిపల్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్లు, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

# భూ భారతి అప్లికేషన్లపై కలెక్టర్ హైమావతి సమీక్ష

**వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**



**సిద్దిపేట, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం భూ భారతి పెండింగ్ అప్లికేషన్‌ల పరిష్కార ప్రక్రియపై జిల్లా కలెక్టర్ శ్రీమతి కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో, తహసీల్దార్‌లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ మిస్సింగ్ సర్వే నంబర్, మ్యుటేషన్, సక్సేషన్, డిఎస్, ఫీల్డ్ ఎంక్వైరీ, చేంజ్ ఆఫ్ నేమ్, నేచర్, ఎక్స్టెండ్ కరెక్షన్, నేషన్ ఖాతా, పిఓబి, సాదా బైనామా వంటి వివిధ రకాల అప్లికేషన్‌లు తహసీల్దార్, ఆర్డీవో, ఏసీ రెవెన్యూ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్నవన్నీ వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలపై అక్రమ కబ్జాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి చట్టంలోని మార్గదర్శకాలను అనుసరిస్తూ, అప్లికేషన్ డిస్పోజల్ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# మహాలక్ష్మి కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**మున్సిపల్ కమిషనర్‌కు మాజీ కార్పొరేటర్ కోడూరి రవీందర్ గౌడ్ వినతిపత్రం**



**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొత్త 10వ డివిజన్ మహాలక్ష్మి కాలనీలో హైమాస్ లైట్లు పాడైపోయి చాలా రోజులుగా వెలగకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ అధికారులకు పలు మార్లు వినతులు చేసినప్పటికీ సరైన స్పందన లేకపోవడంతో, మాజీ కార్పొరేటర్ కోడూరి రవీందర్ గౌడ్ మున్సిపల్ కమిషనర్‌కు ప్రత్యేకంగా వినతిపత్రం అందజేశారు. వీధిలైట్లు సిబ్బంది ఇష్టానుసారంగా ఆన్, ఆఫ్ చేయడం, సమయపాలన లేకుండా ప్రజలను ఇబ్బంది పెట్టడం, కాలనీలో చెత్త తొలగించకపోవడం, మురికి కాలువల వెంబడి పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించకపోవడం వంటి సమస్యలను ఆయన వివరించారు. సంబంధిత డివిజన్ జవాన్‌కు పలు మార్లు మొరపెట్టుకున్నప్పటికీ స్పందన లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మున్సిపల్ కమిషనర్ గారు పై సమస్యలపై దృష్టి సారించి, తగు చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే వివేకానంద నగర్ రోడ్ నెంబర్ 4లో కరెంటు పోల్ వద్ద వీధిలైట్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వాటిని త్వరగా అమర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గ్రామ పాలన అధికారుల సేవల క్రమబద్ధీకరణకు విజ్ఞప్తి




**కరీంనగర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామ పాలన అధికారుల క్యాడర్ స్ట్రెంత్ మంజూరి చేయాలని, అలాగే వివిధ శాఖలలో వీఆర్ఎ పదోన్నతులు పొందిన వార్డ్ ఆఫీసర్లు, రికార్డ్ అసిస్టెంట్లు, చైన్‌మెన్‌లు, ఆఫీస్ సబార్డినేట్‌లు తమ సేవలను క్రమబద్ధీకరించి ప్రొబిషన్ డిక్లరేషన్ చేయాలని కోరుతూ కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు ఈరోజు జిపివోల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోన్నతుల ద్వారా రెండు సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉద్యోగుల సేవలను గుర్తించి, న్యాయమైన విధంగా ప్రొబిషన్ ప్రకటన చేయడం ద్వారా వారి భవిష్యత్తు భద్రతను కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. అలాగే గ్రామ పరిపాలన మరింత సమర్థవంతంగా సాగేందుకు జీపీవోల క్యాడర్ స్ట్రెంత్ మంజూరి అత్యవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా జిపివోల నాయకులు ఊట్ల కృష్ణ, తమ్మిశెట్టి ఆంజనేయ ప్రసాద్, నీర్ల రేవంత్ కుమార్, నలువాల సాయికిషోర్, అందె రవీందర్, నూనె రమేష్, కుమ్మరి హరీష్, వడ్లకొండ శ్రీనివాస్, తాళ్ల వెంకటస్వామి, పైండ్ల సాగర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సుడి దోమ నివారణకు రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**లాలపల్లి గ్రామంలో క్షేత్ర పర్యటన చేసిన ఏడీఏ జక్కుల కాంతారావు**




**ఎలిగేడు, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని లాలపల్లి గ్రామంలో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం తరఫున అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ జక్కుల కాంతారావు పంటలపై క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి, పంటల పరిస్థితిని పరిశీలించారు. వరి పంట ప్రస్తుతం గింజ పాలు పోసుకునే దశలో ఉన్నందున, ఈ సమయంలో సుడి దోమల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. సుడి దోమల నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, ఒక ఎకరానికి బుప్రోఫిజిన్ 320 మిల్లీలీటర్లు, డైనోటెఫ్యూరాన్ 80 గ్రాములు, పైమెట్రోజిన్ 120 గ్రాములు, ట్రైఫ్లూమిజోపైరిమ్ 97 మిల్లీలీటర్లు పిచికారి చేయాలని వివరించారు. అలాగే వరిలో కంకి నల్లి సమస్యను ఎదుర్కొనడానికి స్పైరోమెస్ఫిన్ మందును 150 మిల్లీలీటర్లు పిచికారి చేయాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో ఈ సూచనలను పాటిస్తే, పంట నష్టాన్ని నివారించగలమని ఏడీఏ కాంతారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, వ్యవసాయ విస్తరణ అధికారి సురేష్, పలువురు రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# వికలాంగుడికి అండగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.



**బాలాపూర్, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఓ వృద్ధ వికలాంగుడు తన ఇబ్బందులను వివరించేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చాడు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ని కలసి సహాయం కోరాడు. వికలాంగుడి పరిస్థితి తెలుసుకున్న సబితా ఇంద్రారెడ్డి వెంటనే స్పందించి, వారం రోజుల్లో బ్యాటరీతో నడిచే మూడు చక్రాల వాహనం అందజేస్తాను అని హామీ ఇచ్చారు. అలాగే మీకు, మీ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పోరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఆదిల్ అలీ, పి.ఏ.సి.ఎస్ డైరెక్టర్ కాడమోని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# చైనాను వణికించిన భూకంపం



**న్యూఢిల్లీ అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** చైనా లో భారీ భూకంపం సంభవించింది. షింజియాంగ్ లో మంగళవారం భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.2గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి పది కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. ఈ భూ ప్రకంపనలతో భవనాలు ఊగిపోయాయి. ప్రజలు భయంతో ఇండ్ల నుంచి బయటకి పరుగులు తీశారు. అయితే, ఈ విపత్తులో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.కాగా, గత వారం సిచువాన్ ప్రావిన్స్‌లోని జిన్‌లాంగ్ కౌంటీలో భూమి కంపించిన విషయం తెలిసిందే. భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 5.4గా నమోదైనట్లు చైనా భూకంప కేంద్రం తెలిపింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. ఈ భూకంపం ధాటికి పొరుగున ఉన్న భూటాన్ లోనూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అక్కడ భూకంపం తీవ్రత 3.1గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. ఈ భూకంపం ధాటికి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, ఈ ఘటనలో ధాటికి ప్రాణ నష్టానికి సంబంధించి ఎలాంటి సమాచారం లేదు.

# ఆ దగ్గుమందు కంపెనీ లైసెన్సు రద్దు




**చెన్నై అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సును తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ శాఖ రద్దు చేసింది. కోల్డ్రిఫ్ దగ్గు మందు తయారీ చేస్తున్న ఆ కంపెనీ లైసెన్సును రద్దు చేస్తున్నట్లు డ్రగ్స్ శాఖ వెల్లడించింది. కోల్డ్రిఫ్ దగ్గుమందులో ప్రాణాంతకమైన డైఇథలీన్ గ్లైకాల్ ఉన్నట్లు గుర్తించారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో 21 మంది చిన్నారుల మృతికి కారణమైన ఆ ప్రాణాంతక ఔషధం ఆ దగ్గుమందులో ఉన్నట్లు గుర్తించారు. తమిళనాడు సర్కారు 2011లో శ్రీసన్ ఫార్మసీ కంపెనీకి దగ్గుమందు తయారీకి లైసెన్సు జారీ చేసింది. 2016లో ఆ లైసెన్సుకు రెన్యూవల్ చేశారు. శ్రీసన్ కంపెనీ లైసెన్సు రద్దు చేసి, దాన్ని పూర్తిగా మూసివేసినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర డ్రగ్ తయారీ కంపెనీలపై తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.మరో వైపు శ్రీసన్ ఫార్మసిట్యూకల్స్‌తో పాటు కొందరు డ్రగ్ అధికారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు చేపట్టింది. మధ్యప్రదేశ్ డ్రగ్స్ కంట్రోల్ శాఖ అక్టోబర్ ఒకటో తేదీన తమిళనాడు అధికారులకు ఆ దగ్గుమందుపై అలర్ట్ జారీ చేసింది. కోల్డ్రిఫ్‌తో పాటు అయిదు రకాల ఉత్పత్తులను చెన్నై ల్యాబ్‌లో పరిశీలించారు. దగ్గు సిరప్‌లో ప్రాణాంతకమైన డీఈజీ ఉన్నట్లు గుర్తించారు. అక్టోబర్ 9వ తేదీన మధ్యప్రదేశ్ పోలీసులు కంపెనీ ఓనర్ రంగనాథన్‌ను అరెస్టు చేశారు. 2023లో సరైన రీతిలో తనిఖీలు నిర్వహించని ఇద్దరు తమిళనాడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను కూడా సస్పెండ్ చేశారు.

# సురుమే గూడ గ్రామంలో విద్యుత్ సమస్యలపై బస్తి బాట కార్యక్రమం





**అబ్దుల్లాపూర్ మెట్టు, అక్టోబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్ మెట్టు మండల పరిధిలోని లష్కర్ గూడ గ్రామపంచాయతీకి చెందిన సురుమే గూడ గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బస్తి బాట కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్టు సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ నరేందర్, మండల జడ్పిటిసి బింగి దేవదాస్ కలిసి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో విద్యుత్ సంబంధిత సమస్యలను తెలుసుకునేందుకు అధికారులు ఇంటింటి పరిశీలన నిర్వహించారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు, ప్రస్తుతం ఉన్న 45 కెవి ట్రాన్స్ఫార్మర్‌ను 100 కెవీకి మార్చాలని, అలాగే ఇంటర్ పోల్ తంబాలను 10 వరకు పెంచాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లైన్మెన్ రాందాస్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ గణేష్, గ్రామపంచాయతీ మాజీ వార్డ్ సభ్యులు ఎడ్ల లలిత శ్రీశైలం, కరిమేల శ్రీకాంత్, చెరుకూరి యాదయ్య, గంగని రవి, గంగనీ శ్రీశైలం, ఎండి హుస్సేన్, కరిమెల రాజు, గుండె సుధాకర్, చెరుకూరి నితిన్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారులకు వివరించారు.

# ఘనంగా మహాలక్ష్మి పరపతి సంఘం వార్షికోత్సవ వేడుకలు

**కాశీబుగ్గ లో మహాలక్ష్మి పరపతి సంఘం ఒక గొప్ప సంస్థ**
**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ**



**వరంగల్, అక్టోబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)** శ్రీ మహాలక్ష్మి పరపతి సంఘం గత 02 సంవత్సరాల సర్వసభ్య సమావేశం వివేకానంద కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ హాజరయ్యారు.అనంతరం వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ

సహకార పరపతి సంఘంలో 300 మంది మహిళలు కలిసి నడిపించడం చాలా గొప్ప విషయం, సంఘం అంటే కలిసి ఉండడం పరస్పర సహకార సంఘం ఒక్కరి కోసం అందరూ, అందరి కోసం నేను ఒక్కరు అనే భావనతో నడుస్తుంది. రెండు సంవత్సరాల నుండి కేవలం మహిళలతోనే నడిపించడం చాలా గొప్ప విషయం మనకు ఆర్థిక అవసరాల నిమిత్తం అధిక వడ్డీకి బయట ఆధారపడకుండా సంఘం సహకారంతో తక్కువ వడ్డీకి తీసుకొని అవసరాలు తీర్చుకొని బయట అధిక వడ్డీ కి తీసుకోకుండా మహిళలు ఆర్థికంగా ఎదగడం అభినందనీయం అన్నారు. మీరు పరస్పరం ఒకరికి ఒక్కరు సహకరించుకుంటూ సమాజంలో కూడా ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉండాలని బయట సమాజానికి కూడా ఉపయోగపడాలని అన్నారు.

అనతి కాలం నుండి భారతదేశంలో మహిళలకు అత్యున్నత స్థానం కల్పించే సంప్రదాయం మనది దానికి ప్రతీకగా మాతృదేవోభవ అని బాల్యం నుండి నేర్పిస్తారు. ఈ మధ్య కాలంలో గత కొన్ని సంవత్సరాలుగా ఆడ శిశువులను అబార్షన్ చేయించడం వలన సమాజంలో ఆడ,మగ నిష్పత్తి సమతుల్యత లోపించడం గమనించి ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ భేటీ బచావో భేటీ పడవో (ఆడ బిడ్డను చదవించు – ఆడ బిడ్డను రక్షించు) పథకం ద్వారా గత 4 సంవత్సరాల నుండి ఆడ శిశువుల పరిరక్షణకు, అభ్యునతకు ప్రయత్నిస్తు, ఆడ మగ సమతుల్యతను కొంత వరకు మెరుగుపడటం జరిగింది. 300 సభ్యత్వలుగా ఉన్న ఈ మహాలక్ష్మి మహిళా పరపతి సంఘం అంచె అంచేలుగా ఎదుగుతూ, ఆర్థికంగా బలపడుతూ వేల సభ్యత్వలతో అభివృద్ధి చెందాలని, ఆ సంస్థ 4 సంవత్సరాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డాక్టర్ వన్నాల వెంకట రమణ వారికీ శుభాకాంక్షలు తెలియచేశారు.

ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి భకం హరి శంకర్, కాశీబుగ్గ మండల అధ్యక్షుడు అపురూప రాజేష్ నేత , శ్రీ మహాలక్ష్మి మహిళా పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి కట్ల రాధిక, కోశాధికారి పోరాల్ల లావణ్య , సహాయ కోశాధికారి సిరిమల్లె శ్రీలత , ఆర్గనైజర్స్ సిరిపురం లావణ్య, సహాయ ఆర్గనైజర్ ఆడెపు కవిత తో పాటు సుమారు 200 మంది మహిళలు పాల్గొన్నారు.

# పాక్ ప్రధాని షరీఫ్‌ను పలకరిస్తూనే.. ఇండియాపై ప్రశంసలు కురిపించిన ట్రంప్..

**శర్మ్ ఎల్ షేక్ అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారత్‌పై ప్రశంసలు కురిపించారు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ . ప్రధాని మోదీ పేరును నేరగా చెప్పకుండానే ఆయన్ను కూడా మెచ్చుకున్నారు. ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో ప్రసగించిన తర్వాత ఈజిప్టులో జరిగిన ప్రపంచ దేశాధినేతల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా ఉన్నారు. వేదికపై తన వెనుక నిలబడ్డ పాకిస్థాన్ ప్రధాని షరీఫ్‌ను పలకరిస్తూనే ఇండియాపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. భారత్ గొప్ప దేశమని, నా మిత్రుడు గొప్ప స్థాయిలో ఉన్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్, భారత్ కలిసి మెలిసి మంచిగా జీవిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన అన్నారు. భారత ప్రధాని అద్భుతమైన పని చేశారని అన్నారు. షరీఫ్‌ను పలకరిస్తూ ట్రంప్ మాట్లాడుతున్న వీడియో ప్రస్తుతం వైరల్ అవుతున్నది.ట్రంప్ పలకరించిన సమయంలో షరీఫ్ నవ్వలేక నవ్వారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌ను ఫెవరేట్ ఫీల్డ్ మార్షల్ అని ట్రంప్ పొగిడారు. ఆ సమావేశంలో మాట్లాడేందుకు పాక్ ప్రధానిని కూడా ఆయన ఆహ్వానించారు. పశ్చిమాసియాలో శాంతి వెల్లువిరిసిందని, దీంట్లో




ట్రంప్ కృషి విశేషంగా ఉన్నట్లు షరీఫ్ తెలిపారు. నోబెల్ శాంతి పురస్కారం కోసం డోనాల్డ్ ట్రంప్‌ను మళ్లీ నామినేట్ చేయడానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉన్నట్లు ప్రధాని షరీఫ్ చెప్పారు. దక్షిణాసియాతో పాటు పశ్చిమాసియాలో లక్షలాది మందిని ఆయన రక్షించారన్నారు. నోబెల్ పీస్ ప్రైజ్ గురించి ట్రంప్ మాట్లాడుతూ.. తాను 8 యుద్ధాలను ఆపాలని, దాంట్లో ఇండోపాక్ వార్ కూడా ఉందని, కానీ ఇవన్నీ నోబెల్ అవార్డు కోసం చేయలేదన్నారు.

# భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ లాంటి గొప్ప పార్టీ లేదు

**డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**



**వనపర్తి అక్టోబర్ 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి దాక్ష లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన సంఘతాన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ దేశ చరిత్రలో అగ్రగామి పాత్ర పోషించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమానికి పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి, ఏఐసీసీ అబ్జర్వర్ వి. నారాయణస్వామి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, టీపిసిసి పరిశీలకుడు ఎంఎల్సీ అమీర్ అలీ ఖాన్, సంధ్యారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నందిమల్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు. నారాయణస్వామి మాట్లాడుతూ, డిసిసీ అధ్యక్షుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించేందుకు ఏఐసీసీ రాష్ట్రాల వారీగా అబ్జర్వర్లను నియమించిందని తెలిపారు. బ్లాక్, నియోజకవర్గ స్థాయిలో అభిప్రాయ సేకరణ చేసి, ఈ నెల 20లోపు వివరాలు ఏఐసీసీకి పంపిస్తామని చెప్పారు.చిన్నారెడ్డి మాట్లాడుతూ, జిల్లా అధ్యక్ష పదవి పార్టీకి మూల స్తంభమని, కాంగ్రెస్ బలోపేతం కోసం అర్హులైన నాయకులకే పదవి దక్కుతుందని అన్నారు. వనపర్తి అధ్యక్ష పదవి టిఆర్ఎస్ ప్రభుత్వ అన్యాయాలను ఎదుర్కొన్న నిబద్ధతగల నాయకునికి ఇవ్వాలని సూచించారు.



## బంగారంలా మెరిసిపోతున్న మానుషి..

### అందంతో ఆగం చేస్తుందిగా..

ఈ అమ్ముడు అందానికి బ్రహ్మదేవుడే ఫిదా అయిపోతాడేమో అంతలా తన గ్లామర్‌తో కుర్రకారు మనసు దోచేస్తుంది బ్యూటీ మానుషి చిల్లర్, ఈ అమ్ముడు గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. మిస్ వరల్డ్ కిరీటాన్ని అందుకొని, నటనపై ఉన్న ఇంట్రస్ట్‌తో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టింది.బాలీవుడ్ సామ్రాట్ మూవీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకుంది. కానీ మూవీ మాత్రం హిట్ అందుకోలేకపోయింది. అయినా కూడా ఈ బ్యూటీకి వరసగా ఆఫర్స్ రావడం జరిగింది. వచ్చిన ప్రతి అవకాశాన్ని వదులు కూకుండా సినిమాలు చేసింది.కానీ ఒక్క సినిమా కూడా బ్లాక్ బస్టర్ హిట్ అందుకోలేదు. దీంతో మెల్లి మెల్లిగా ఈ బ్యూటీ గ్రాఫ్ పడిపోయిది. ఇక తెలుగులో వరుణ్ తేజ సరసన ఆపరేషన్ వాలెంటైన్ మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. కానీ ఈ మూవీ కూడా అంతగా హిట్ అవ్వకపోవడంతో ఈ అమ్ముడు తెలుగు అభిమానుల మనసుదోచుకోలేకపోయింది.ఇక ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ పలు సినిమాల్లో నటిస్తూ, మంచి హిట్ కోసం ఎదురు చూస్తుంది. కానీ ఈ బ్యూటీకి ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదని టాక్ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటే ఈ బ్యూటీ, తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంటుంది. తాజాగా గోల్డ్ కలర్ డ్రెస్‌లో తన అందంతో అందరినీ మాయ చేస్తోంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

## అందంతో గత్తర లేపిన విష్ణు ప్రియా..

బుల్లితెరపై చాలా మంది యాంకర్స్ గా మంచి క్రేజ్ తెచ్చుకున్నారు. అలాంటి వారిలో విష్ణు ప్రియా ఒకరు. ఈ అమ్మడు తన చలాకీ మాటలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆతర్వాత రాను రాను తన అందాలతో కురాళ్లను కట్టిపడేసింది.కెరీర్ బిగినింగ్ లో పలు షార్ట్ ఫిలిమ్స్ లో నటించింది విష్ణు ప్రియా.. ఆతర్వాత యాంకరింగ్ వైపు వచ్చింది. సుడిగాలి సుధీర్ తో కలిసి పోవే పోరా అనే షో చేసింది విష్ణు ప్రియా. ఈ షో ద్వారా ఈ అమ్మడుకి మంచి క్రేజ్ వచ్చింది.ఆతర్వాత కొన్ని టీవీ షోల్లో కనిపించింది. అలాగే ఒకటిరెండు ప్రైవేట్ సాంగ్స్ లోనూ మెరిసింది ఈ ముద్దుగుమ్మ. ఇదిలా ఉంటే ఇప్పుడు ఈ చిన్నది తన అందాలతో మతిపోగొడుతోంది. సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తోంది.సోషల్ మీడియాలో విష్ణు ప్రియకు మంచి క్రేజ్ ఉంది. ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా గట్టిగానే ఉంది. ఇప్పుడు ఆ క్రేజ్ తోనే బిగ్ బాస్ సీజన్ 8 లోకి అడుగు పెట్టింది. బిగ్ బాస్ హౌస్ లో తన గేమ్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆతర్వాత ఈ బ్యూటీ సోషల్ మీడియాతో అలరిస్తుంది.రెగ్యులర్ గా గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ మెప్పిస్తుంది. తాజాగా ఈ అమ్మడు కొన్ని క్రేజీ ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంది. నెటిజన్స్ ఈ అమ్మడి ఫోటోలకు కొంటె కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోలకు కుర్రాళ్ళు ఫిదా అవ్వాల్సిందే..





## నేను భయపడ్డా కానీ ఊహించినంత ఏం జరుగలేదు..

### పెళ్లిపై కీర్తిసురేశ్

మహానటి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కీర్తిసురేశ్. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతోంది. సుదీర్ఘ కాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్న కీర్తిసురేశ్, ఆంటోనీ థట్టిల్ ఫైనల్‌గా 2024లో వివాహబంధంతో ఒక్కటయ్యారు. తన కాలేజీ రోజుల్లో లవ్ స్టోరీ గురించి చెబుతూ తాము పెళ్లి చేసుకోవడానికి 15 ఏళ్ల వెయిట్ చేశామంది.జగపతిబాబు టాక్ షో జయమ్ము నిశ్చయమ్మురా టాక్ షోలో ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకుంది కీర్తిసురేశ్.కీర్తిసురేశ్, ఆంటోనీ రిలేషన్‌షిప్ 2010లో మొదలైందట. ఈ విషయంపై కీర్తిసురేశ్ మాట్లాడుతూ.. తాను సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చేకంటే ముందు 2010 ఇద్దరి రిలేషన్‌షిప్ మొదలుపెట్టినట్టు చెప్పారు. నేను కాలేజీ పూర్తి చేసి నా కెరీర్‌పై ఫోకస్ పెట్టాలనుకున్నా. ఐదారేళ్లు లాంగ్ డిస్టేన్స్ రిలేషన్‌షిప్‌లో ఉన్నాం. అతను ఖతార్‌లో ఉంటే.. నేను చెన్నైలో ఉన్నా. అతడు ఇండియా వచ్చిన తర్వాత మేమిద్దరం సెటిల్ అవ్వడానికి టైం కావాల్సి వచ్చింది.తమ మధ్య మతపరమైన విబేధాల కారణంగా నా కుటుంబం మా ఇద్దరి పెళ్లిని ఒప్పుకోదేమోనని భయపడ్డా. ఇంట్లో మతం సమస్యగా మారొచ్చని అనుకున్నాం. నాలుగేళ్ల క్రితం నాన్నతో ఆంటోని గురించి మాట్లాడాను. ఆయన చాలా తేలికగా పని అయిపోయేలా చేశారు. నేను ఊహించనంతగా అసలేం జరుగలేదంది కీర్తిసురేశ్



## శ్రద్ధాకపూర్ ఫాంటసీ సినిమా.. డైరెక్టర్ ఎవరో తెలుసా..?

బాలీవుడ్‌లో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ భామల్లో శ్రద్ధాకపూర్ ఒకరు. ఈ భామ హార్రర్ థ్రిల్లర్ జోనర్‌లో నటించిన స్త్రీ 2 బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. స్క్రిప్టుల ఎంపికలో ఆచితూచి వ్యవహరించే ఈ భామకు సంబంధించిన కొత్త వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. శ్రద్ధాకపూర్ ఈ సారి ఫాంటసీ సినిమాకు ఒకే చెప్పిందట.పహడ్‌పంగిర టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాకు రహి అనిల్ బర్వే దర్శకత్వం వహించనున్నాడు. ఫెమినిజం బ్యాక్ డ్రాప్ స్టోరీతో రాబోతున్న ఈ చిత్రాన్ని ఏక్తాకపూర్ తెరకెక్కించనుందని బీటౌన్ సర్కిల్ సమాచారం. పురాణం, జానపద కథల నేపథ్యంలో సాగే ఫాంటసీ నేపథ్య కథ అట.ఇండియన్ సినిమాలో ఉన్న బెస్ట్ హార్రర్ థ్రిల్లర్ ప్రాజెక్టుల్లో టాప్‌లో ఉంటుంది Tumbbad. తాజా టాక్ ప్రకారం రహి అనిల్ ఈ చిత్రాన్ని తుంబాడ్ యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కించాలని అనుకున్నాడట. అయితే యాక్టర్ కమ్ ప్రొడ్యూసర్ సోహమ్ షాతో వచ్చిన విబేధాల కారణంగా ఈ ఆలోచన నుంచి విరమించుకున్నాడని బీటౌన్ సర్కిల్ సమాచారం. మరి పహడ్‌పంగిరకు సంబంధించి శ్రద్ధాకపూర్ టీం నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి.



## ‘బాహుబలి’ని బీట్ చేసిన రిషభ్ శెట్టి ‘కాంతార చాప్టర్ 1’

కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన కాంతార చాప్టర్ 1 చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.500 కోట్లను అలవోకగా దాటిన ఈ చిత్రం ప్రస్తుతం రూ.650 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ సందర్భంగా కాంతార అరుదైన మైలురాయిని అందుకుంది. ఈ సినిమా రూ.650 కోట్ల దాటడంతో బాహుబలి పార్ట్ 1 మీద ఉన్న రికార్డును ఈ సినిమా అధిగమించింది. బాహుబలి-ది బిగినింగ్ చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.650 కోట్ల వసూళ్లను సాధించగా.. ఈ రికార్డును చెరిపివేస్తూ.. కాంతార రూ.675 కోట్లతో దూసుకుపోతుంది. దీంతో దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన టాప్-20 చిత్రాల్లో కాంతార 17వ స్థానానికి ఎగబాకింది. 2025లో అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాల్లో రెండో ప్లేస్ దక్కించుకుంది.